

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5 శుక్రవారం 7 ఫిబ్రవరి 2025



అమృత్ 2.0 ఆమోదం



నరసరావుపేటలో అభివృద్ధి చేయనున్న కత్తవ చెరువు

పురాల్లో పట్టాలెక్కనున్న పనులు

- రూ.964.31 కోట్లతో ప్రణాళికలు సిద్ధం
- కేంద్రం నుంచి 50 శాతం నిధులు మంజూరు
- వైసీపీ హయాంలో నిలిచిపోయిన పనులకు మోక్షం
- రాష్ట్ర ప్రభుత్వ, మున్సిపల్ వాటాగా ఆర్థిక సంఘం నిధులు
- పురపాలక సంఘాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

అమృత్ 2.0 ఆమోదంతో మున్సిపాలిటీల్లో శాశ్వతంగా తాగునీటి సమస్య తీరనున్నది. ఈ పథకం కింద తాగునీటి పథకాల విస్తరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం, తాగునీటి చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టనున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పురాల్లో అమృత్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ పనులను కూడా అమృత్ 2.0లో చేర్చారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో నిలిచిపోయిన పనులు చేపట్టేందుకు తాజాగా వ్యయ అంచనాలను అధికారులు రూపొందించారు. రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఆ డీపీఆర్‌లను బుధవారం ఆమోదించింది. దీంతో అమృత్ పనులు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. మున్సిపాల్టీలలో తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో విస్తరించి నూరు శాతం గృహాలకు కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీరు ఇచ్చే దిశగా పనులు చేపట్టనున్నారు.



నరసరావుపేటలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపల్ కేంద్రాల్లో ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అమృత్ పనులకు ఆమోదంతో మున్సిపాల్టీలకు మహర్దశ పట్టనుంది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపాల్టీలు దామాషా ప్రకారం అమృత్ పనులకు నిధులు సమకూరనున్నాయి. దాదాపు రూ.964.31 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయి. కేంద్రం వాటా కింద 50 శాతం నిధులు మంజూరయ్యాయి. మున్సిపల్ పట్టణాల్లోని ప్రతి ఇంటికి నీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని, సురక్షితమైన తాగునీరు అందించాలన్నది అమృత్ లక్ష్యం. అయితే గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అమృత్ లక్ష్యం నీరుగారిపోయింది. వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకపోవడంతో పాటు కేంద్రం విడుదల చేసిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించుకుంది. దీంతో అమృత్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో తాజాగా అమృత్ పనులకు ఆమోదంతో పురాల్లో పనులు త్వరితగతిన చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అమృత్-1 పథకంలో నిలిచిపోయిన పనులను కూడా కొన్నింటిని అమృత్ 2.0లో చేర్చారు. అమృత్ పనులకు నిధుల భారం రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపాల్టీలపై పడకుండా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం

(మిగతా 8వ పేజీలో)

వ్యయం అంచనా వివరాలు

మున్సిపాల్టీ	వ్యయం (రూ.కోట్లలో)
పల్నాడు జిల్లా..	
నరసరావుపేట	29.42
చిలకలూరిపేట	160.90
వినుకొండ	29.57
దాచేపల్లి	8.61
పిడుగురాళ్ల	36.29
గురజాల	5.27
మాచర్ల	43.43
సత్తెనపల్లి	0.72
గుంటూరు జిల్లా..	
గుంటూరుకార్పొరేషన్	381.12
మంగళగిరి-తాడేపల్లి	76.43
తెనాలి	61.61
పొన్నూరు	22.10
బాపట్ల జిల్లా..	
చీరాల	32.68
బాపట్ల	25.32
రేపల్లే	45.74
అద్దంకి	5.10

మంత్రులు @ 13,21

గొట్టిపాటి, అనగాని పనితీరుకు ర్యాంకులు

డిసెంబరు వరకు ఫైళ్ల క్లియరెన్స్ ప్రామాణికంగా సీఎం ప్రకటన



గొట్టిపాటి రవికుమార్



అనగాని సత్యప్రసాద్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేలు రెండు కీలక శాఖలకు మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారు ప్రమాణ స్వీకారం చేసి దాదాపు ఎనిమిది నెలలు అవుతోంది. ఈ క్రమంలో వారి పనితీరు ఆధారంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ర్యాంకులు ఇచ్చారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 13వ స్థానం, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ 21వ స్థానంలో నిలిచారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి గతేడాది డిసెంబరు చివరి వరకు ఫైళ్ల క్లియరెన్స్ ప్రామాణికంగా సీఎం చంద్రబాబునాయుడు మంత్రులకు ర్యాంకులు ఇచ్చారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విద్యుత్‌శాఖ, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రెవెన్యూశాఖల మంత్రులుగా ఉన్నారు. ఈ క్రమంలో ప్రస్తుత ర్యాంకులు పనితీరు విషయంలో వారు ఇంకా మెరుగుపడాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి.

రెవెన్యూ చుట్టూనే కేంద్రీకృతం..

గత ప్రభుత్వం అన్ని విధాల భ్రష్టు పట్టించిన రెవెన్యూ శాఖ బాధ్యతలను అనగాని తీసుకున్నారు. గత ప్రభుత్వం భూముల విషయంలో ఇష్టారీతిన నిబంధనలకు ఉల్లంఘనలకు పాల్పడిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి వైసీపీ హయాం లోని భూ బాగోతాల మీద దృష్టి పెట్టి బాధితులకు న్యాయం చేయడమే అజెండాగా రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. తవ్వే కొద్దీ భూబాగోతాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. వీటికి పరాకాష్ఠగా బాపట్లలో సీఎం చంద్రబాబునాయుడు పేరు మీద ఉన్న స్థలాన్నే దొంగ దస్తావేజులతో వేరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన ఉదంతం ఇటీవలే వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఇంతటి కీలకమైన శాఖ పనితీరులో మంత్రి అనగానికి 21వ ర్యాంకు దక్కింది.

విద్యుత్‌రంగంలో సంస్కరణలు

గత ప్రభుత్వం ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచి కరెంటు బిల్లులు అంటేనే ప్రజలు భయపడే పరిస్థితిని తీసుకువచ్చింది. గత ప్రభుత్వం అడ్డగోలుగా తీసుకున్న విద్యుత్ ఒప్పందాలను సమీక్షించడంతో పాటు కొత్తగా సోలార్‌కు సంబంధించి పెద్దఎత్తున రాయితీలు ఇవ్వడం లాంటి వన్నీ విద్యుత్‌శాఖ ముమ్మరంగా చేస్తోంది. ఈ శాఖ బాధ్యతల్లో ఉన్న గొట్టిపాటి 13వ ర్యాంకు దక్కింది. ఇక జిల్లాకు ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న కొలుసు పార్థసారథికి 23వ స్థానం దక్కడం గమనార్హం.

పంచాయతీల్లో అక్రమాల నిగ్గు తేల్చండి

విచారణకు ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల్లో ఇష్టారీతిన నిధులు దుర్వినియోగమైన ఫిర్యాదులు పెద్ద సంఖ్యలో వచ్చిన సంగతి తెలిసిందే. ఇలా వచ్చిన వాటిలో ప్రధానంగా కారంచేడు మండలం కుంకలమర్రు పంచాయతీ కూడా ఉంది. అక్రమాలపై గ్రామస్థులు గతంలో ఇచ్చిన వినతిపత్రం మేరకు కలెక్టర్ వెంకటమురళి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు చీరాల ఆర్డీవో, ఏపీసీపీడీసీఎల్ ఎస్‌ఈ, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ లను విచారణ చేపట్టాలని కలెక్టర్ గురువారం ఉత్తర్వు లు జారీ చేశారు. మూడు రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో సదరు పంచాయతీలో అక్రమాలకు పాల్పడ్డ వారి వెన్నులో వణుకు మొదలైంది.

నామినేషన్లకు ఇక రెండు రోజులే 8
- నేడు, 10 తేదీల్లో మాత్రమే అవకాశం
- 8, 9 తేదీల్లో రెండో శని, ఆదివారం సెలవుదినాలు

గాజులంకలో ఇసుక తవ్వకాలు బంద్ 6
నేటితో ముగియనున్న అనుమతులు

సీఈవో మాకొద్దు
◆ జిల్లా పరిషత్‌ను భ్రష్టుపట్టించారు ◆ పంచాయతీ రాజ్ మంత్రి, కమిషనర్‌కు లేఖ రాసిన జడ్పీ చైర్‌పర్సన్

బీసీల అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉంది

సత్తెనపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపులో పది శాతం రిజర్వేషన్ కల్పించటం టీడీపీ బీసీల పార్టీ అనటానికి నిదర్శనమని రాష్ట్ర నీర, గీత కార్మిక ఫెడరేషన్ చైర్మన్, టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు తాత జయ ప్రకాష్ నారాయణ అన్నారు. గురువారం సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పుడూ బీసీలకు అండగా ఉంటూ బీసీ సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు 335 షాపులు కేటాయించటంపై బీసీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. గీత కార్మికుల ఆర్థిక బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. లైసెన్స్ ఫీజులో గీత కార్మికులకు 50 శాతం రాయితీ కల్పించిందన్నారు. గీత కార్మికులకు పది శాతం మద్యం దుకాణాలు కేటాయించ కూడదని హైకోర్టులో తన మనుషుల చేత 30 రిట్ పిటీషన్‌లను వైఎస్ జగన్ దాఖలు చేయించాడన్నారు. మద్యం దుకాణాలు కేటాయిస్తే గీత కార్మికులు ఆర్థికంగా బలోపేతం అవుతారని భావించి, దీన్ని అడ్డుకొనేందుకు వైఎస్ జగన్ పన్నాగం పన్నారన్నారు. జగన్ బీసీల వ్యతిరేకి అని మరోసారి రుజువైందన్నారు. వైసీపీ పాలనలో బీసీలను జగన్‌మోహన్‌రెడ్డి అణిచి వేశారన్నారు. వైసీపీ పాలనలో పదిశాతం రిజర్వేషన్ తగ్గించటం వల్ల 18 వేల మంది బీసీలు రాజకీయ పదవులకు దూరమయ్యారన్నారు. రాజకీయ పదవుల్లో 33 శాతం పదవులు బీసీలకు కేటాయించి వారి రాజకీయ ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం బాటలు వేసిందన్నారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లపాలెం గ్రామంలో 14 క్వింటాళ్ల రేషన్ బియ్యంను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం తాళ్లపాలెం గ్రామంలో రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారంతో బుధవారం రాత్రి రూరల్ పోలీసులు గ్రామంలో సోదాలు నిర్వహించారు. 28 బస్తాలలో నిల్వ ఉన్న రేషన్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 547.80 అడుగులు ఉంది. ఇది 204.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6248 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,275 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 31,203 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,099 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఈ సీఈవో మాకొద్దు

- జిల్లా పరిషత్‌ను భ్రష్టు పట్టించారు
- కమీషన్లపై తప్ప.. కార్యాలయంపై శ్రద్ధలేదు
- పంచాయతీ రాజ్ మంత్రి, కమిషనర్‌కు లేఖ రాసిన చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈవో జ్యోతిబసు అవినీతికి హద్దు లేకుండా పోయిందనీ, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు రెండు శాతం మామూళ్లు ముట్టజెప్పాలన్న నిబంధన పెట్టారనీ, ఎంపీడీవోల కార్యాలయాలు, గ్రామ పంచాయతీల తనిఖీకి వెళ్లినప్పుడు రూ. 25 వేలకు తగ్గకుండా కవర్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారని తదితర ఆరోపణలతో ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్, పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా లేఖ రాశారు. జడ్పీ సీఈవోపై అవినీతి ఆరోపణలు చేస్తూ చైర్‌పర్సన్ లేఖ రాయడం సంచలనంగా మారింది. గత కొద్ది రోజులుగా జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినాకు, సీఈవో జ్యోతిబసుకు మధ్య అంతర్గత యుద్ధం జరుగుతుంది. పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలను సైతం సీఈవో పక్కన పడవేస్తుండటం వివాదానికి మూలకారణంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో కొన్ని వందల ఫైళ్లను సీఈవో పరిష్కరించకుండా జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. చివరకు జిల్లా పరిషత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే విద్యా దీవెన స్టడీ మెటీరియల్ వ్యవహారంలో కూడా సీఈవో జడ్పీ చైర్‌పర్సన్ చేసిన సూచనలు బేఖాతార్ చేయటంతో వివాదం ముదిరి పాకాన పడింది.

సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు వద్దు

ప్రతి ఏటా జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు జడ్పీ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. విద్యా దీవెన పేరుతో ఈ కార్యక్రమం అమలు జరుగుతుంది. ప్రతి ఏటా ముద్రించే స్టడీ మెటీరియల్‌పై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఫొటోలు ముద్రించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే రీతిలో స్టడీ మెటీరియల్‌పై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫొటోలు వేయాలని చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా సూచించినట్లు తెలుస్తుంది. అందుకు సీఈవో ఒప్పుకోక పోగా, ఆ విషయాన్ని అడ్డం పెట్టుకుని స్టడీ మెటీరియల్ ముద్రణ విషయంలో తీవ్రమైన జాప్యం చేసినట్లు చైర్‌పర్సన్ ఆరోపిస్తున్నారు. కేవలం స్టడీ మెటీరియల్ విషయమై పది సార్లు సమావేశం ఏర్పాటు చేసి డిసెంబరు నెలలో నే విద్యార్థులకు వాటిని అందజేయాలని సూచించినా, టెండర్లు పిలవటానికి నెల రోజులు కాలయాపన చేసినట్లు ఆరోపిస్తున్నారు. చివరకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫొటోలు లేకుండానే విద్యా దీవెన స్టడీ మెటీరియల్ వచ్చేసిందని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 13 నెలలుగా జీతాల్లేవు

సీఈవో వైఖరి వలన గత 13 నెలలుగా జడ్పీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కు జీతాల్లేక అల్లాడిపోతున్నారని చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఆరోపిస్తున్నారు.

సీసీ ద్వారా మంత్రి కార్యాలయానికి లేఖ..

పంచాయతీ రాజ్ శాఖ మంత్రిని స్వయంగా కలిసి లేఖను అందజేయాలని చైర్ పర్సన్ తొలుత భావించారు. అయితే ఆయన అనారోగ్యంతో ఉన్నారని తెలుసుకొని లేఖను సీసీ ద్వారా మంత్రి కార్యాలయానికి గురువారం పంపారు. ఉపముఖ్యమంత్రి కోలుకున్న తర్వాత ఆయన్ను స్వయంగా కలిసి సీఈవోపై ఫిర్యాదు చేస్తానని చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణపై సమీక్ష



సమీక్షా సమావేశంలో బాలల హక్కుల కమిషన్ సభ్యులు, అధికారులు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ తిరునాళ్లలో కోటయ్యను దర్శించుకునేందుకు లక్షలాది మంది పెద్దలు, వేలాది మంది చిన్నపిల్లలు హాజరయ్యే అవకాశం ఉన్నందున బాలలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లుపై ఆలయ ప్రాంగణంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఆలయ అధికారులు, కార్మిక శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, గ్రామ సచివాలయాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మావతి, ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి చంద్రశేఖర్ ద్వారా గత ఏడాది ఎంతమంది పిల్లలు ఈ ఉత్సవాల్లో పాల్గొని ఉంటారు, వారిలో చంటి పిల్లలు సంఖ్య ఎంత, బాలింతలు ఎంతమంది హాజరై ఉంటారు, అధికారిక లెక్కలు ఉన్నాయా, ఆలయంలో పిల్లలకు ప్రత్యేక పాలసీలు ఏమైనా అమలు చేస్తున్నారా, వాటి వివరాలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది బాలింతలు, చిన్న పిల్లలు స్వామివారి దర్శనానికి ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారా, దివ్యాంగ పిల్లలు దర్శనానికి ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారు తదితర వివరాలు అడిగారు. బాల యాచకులు లేకుండా దేవస్థానం అధికారులు సమన్వయంతో ఎటువంటి చర్యలు చేపట్టారో కార్మిక శాఖాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో బాలల హక్కులు, వాటి పరిరక్షణకు సమీక్ష సమావేశాలు నిర్వహించి, సంబంధిత ఉన్నతాధికారులకు వివిధ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. కోటప్పకొండ ఆలయ కార్యనిర్వహణ అధికారి దాసరి చంద్రశేఖర్, సీడీపీవో ఉమామహేశ్వరి, వై.ప్రశాంత్‌కుమార్, ఆదిలక్ష్మి, ఎం.వాణి, జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జలవిహార్, ఫుడ్‌కోర్టులు సిద్ధం చేస్తాం

- పర్యాటక శాఖ జిల్లా అధికారి గంగినేని నాయుడమ్మ



జలవిహార్‌ను పరిశీలిస్తున్న పర్యాటక శాఖ అధికారి గంగినేని నాయుడమ్మ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరగనున్న తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఏర్పాట్ల నిర్వహణలో పర్యాటక శాఖ ఉత్సాహం చూపించడంలేదు. ఈ నేపథ్యంలో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కోటప్పకొండలో ఉద్యానవనం వెలవెల అనే కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన పర్యాటక శాఖ జిల్లా అధికారి గంగినేని నాయుడమ్మ గురువారం కోటప్పకొండలోని మెట్లమార్గం వద్ద గల జలవిహార్, ఫుడ్‌కోర్టులను పరిశీలించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి గంగినేని నాయుడమ్మ మాట్లాడుతూ కొండ కింద మెట్లమార్గం వద్ద గల జలవిహార్, ఫుడ్‌కోర్టును ఎటువంటి నిర్వహణ వ్యయం లేకుండా గుత్తేదారుడకి ఇచ్చినా కూడా నిర్వహించలేనని వెళ్లిపోయాడన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు రానున్న శివరాత్రి మహోత్సవం సందర్భంగా జలవిహార్, ఫుడ్ కోర్ట్ సందర్శకులకు సౌకర్యాలు అందించాలని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. వారు దానిని బాగు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, శివరాత్రి మహోత్సవం రోజుకి ఫుడ్‌కోర్ట్, జలవిహార్‌లో కనీసం రెండు లేదా మూడు పెడల్ బోట్స్‌తో పర్యాటకులకు సౌకర్యం కల్పించే విధంగా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తదనంతరం ఎవరైనా గుత్తేదారులు ముందుకు వస్తే నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ టెండర్లు కూడా సిద్ధం చేస్తున్నారని తెలిపారు.

నేటితో ఇసుక తవ్వకాలకు ముగియనున్న అనుమతులు



గాజుల్లంక వద్ద ప్రభుత్వ ఉచిత ఇసుక డంపింగ్ యార్డు

కొల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత ఇసుక రీచ్‌ల కాలపరిమితి శుక్రవారంతో ముగియనుంది. ప్రజల అవసరార్థం కొల్లూరు మండలం గాజుల్లంకలో ప్రభుత్వం ఉచిత ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసింది. గత అక్టోబరు 16న గుత్తేదారులకు కృష్ణానదిలో ఉచిత ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చింది. అప్పటి నుంచి గుత్తేదారులు కృష్ణానదిలో తవ్వకాలు చేసి నది ఒడ్డున ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో ఇసుక నిల్వ చేసి వినియోగదారులకు అందిస్తున్నారు. అయితే ప్రభుత్వం నిర్దేశించిన ధరలు మాత్రం ఎక్కడా అమలు కాకపోవడంతో వినియోగదారులకు ఉచిత ఇసుక అందని ద్రాక్షగా మారింది. గుత్తేదారులకు మాత్రం కాసుల వర్షం కురిపించింది. ఇసుక తవ్వకాల్లో గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు ఎక్కడా అమలు కాకపోవడం గమనార్హం. ఉచిత ఇసుక తవ్వకాల పేరుతో గుత్తేదారులు అప్పటి నుంచి ఇష్టానుసారంగా నదిలో ఎక్కడబడితే అక్కడ రాత్రి పగలు తేడా లేకుండా తవ్వి సొమ్ము చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు పర్యావరణ అనుమతులు ముగియనుండటంతో ఇక గాజుల్లంక వద్ద కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు నిలిపి వేయాల్సి ఉంది. అయితే గుత్తేదారులు మాత్రం కాలపరిమితి ముగిసినప్పటికీ ఇసుక తవ్వకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతులు పొడిగించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. తవ్వకాలు పూర్తిగా నిలిపి వేస్తారో తిరిగి కొనసాగిస్తారో వేచి చూడాల్సిందే.

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం

కృష్ణానదిలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మండల పరిధిలోని గాజుల్లంక ఇసుక రీచ్‌కు అనుమతులు శుక్రవారం సాయంత్రంతో ముగియనున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని అరవింద వారధి, చిలుమూరు గ్రామాల వద్ద కృష్ణానదిలో స్థానిక అవసరాల పేరుతో విచ్చలవిడిగా ఇష్టానుసారంగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. అయా తవ్వకాలను కూడా అడ్డుకుంటామని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రాంతాల్లోనే ఇసుక తవ్వకాలు జరిగేలా చూస్తామన్నారు. అరవింద వారధి, చిలుమూరు వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు నిలువరించేందుకు పోలీసు శాఖలో సమన్వయం చేసుకుని ప్రత్యేక బృందాలను నియమించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

క్రమబద్ధమైన వ్యాయామంతో మానసిక రుగ్మతలు దూరం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇతర అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నడక, వ్యాయామం, యోగా వంటి మంచి అలవాట్లను క్రమం తప్పకుండా పాటిస్తే మానసిక రుగ్మతలు, ఒత్తిడి నుంచి బయటపడవచ్చునని విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. మేనేజింగ్ స్ట్రెస్ డిప్రెషన్ టు ఎన్ హాన్స్ సైకలాజికల్ క్యాపిటల్ అనే అంశంపై వర్సిటీలోని సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ప్రారంభ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ పని ఒత్తిడి అనేది ఈ రోజుల్లో సర్వసాధారణమైన విషయం అన్నారు. డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఒత్తిడి నుంచి బయట పడాలంటే సుఖమయ జీవనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ మానవ జీవన ప్రయాణంలో సైకలాజికల్, మెంటల్, ఫిజికల్ హెల్త్ విషయాలలో ఒత్తిడి అధికంగా ఉంటుందన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి .సింహాచలం మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంతో పాటు సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, పాలకమండలి సభ్యులు ఇండ్ల రాధా, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి, సదస్సు డైరెక్టర్ ఆచార్య టీడీ విమల ప్రసంగించారు. పరిశోధన పత్రాలను ముద్రించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన డాక్టర్ రవికాంత్, ఆచార్య ప్రసాద్ బాబు, డాక్టర్ సువర్ణ రాజు, డాక్టర్ స్వాతి, ఆచార్య సరోజ, విభాగం అధ్యాపకులు కె.కృష్ణమోహన్, ఎస్.అనుపమ, బి. ప్రమీలారాణి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతిపై అత్యాచారం: కేసు నమోదు

మాచవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి పై కేసు నమోదు చేసిన సంఘటన మండల కేంద్రమైన మాచవరంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మాచవరంలోని బుడగ జంగాల కాలనీలో ఓ యువతి ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. ప్రతి రోజూ మాచవరం గ్రామానికి చెందిన నల్లమేకల వెంకటేష్ జీవాలు మేపుకుంటూ ఆ యువతిని చూస్తూ ఉండేవాడు. బుధవారం ఆ యువతి ఇంట్లోకి చొరబడి యువతి నోట్లో బట్టలు కుక్కి అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సమయంలో పొలం నుంచి తిరిగి వచ్చిన యువతితల్లిని చూసి వెంకటేష్ పరారయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తండ్రితో యువతి తల్లి జరిగిన సంఘటన వివరించగా వెంటనే చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై మాచవరం పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మసాజ్ సెంటరుపై పోలీసుల దాడి

- ముగ్గురు యువతులు అరెస్టు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోని లలితాదేవి నగర్ మొదటి లైన్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మసాజ్ సెంటరుపై నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ దాడి చేశారు. ఈ దాడులలో నిర్వాహకుడు సుబ్రమణ్యంతోపాటు మరో ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. వారిని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. నరసరావుపేట మండలంలో ఎటువంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామన ఆయన హెచ్చరించారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



విజయ్‌కుమార్ (ఫైల్)

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో కుడి కాలువలో దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభ్యమైంది. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన గుంటూరు విజయ్‌కుమార్ (28) పట్టణంలోని రింగు రోడ్డు ప్రాంతంలో టీస్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం రేపల్లెకి చెందిన సుబ్బలక్ష్మితో వివాహమైంది. గత కొంతకాలంగా భార్య సుబ్బలక్ష్మితో మనస్పర్థలు రావడంతో ఘర్షణలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన విజయ్‌కుమార్ గత మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన అక్క యాగంటి స్వాతి, బావ ఆదినారాయణకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి పట్టణంలోని బొంబాయి కంపెనీ వద్ద గల కుడికాలువలో దూకాడు. కాగా విజయ్‌కుమార్ మృతదేహం గురువారం దుర్గి వద్ద గల బుగ్గవాగు డ్యాం వద్ద లభ్యమైంది. విషయం తెలుసుకున్న మాచర్ల పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

చేబ్రోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు గురువారం మృతి చెందాడు. చేబ్రోలు ఎస్సై వెంకట కృష్ణ కథనం ప్రకారం విజ్ఞాన్ యూనివర్సిటీ సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న మెట్లకాటి మణికంఠేశ్వర రెడ్డి (25) ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం స్థానికులు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మణికంఠేశ్వర్ రెడ్డి మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మీరెడ్డి ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

చేబ్రోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు - కొమ్మమూరు కాల్వ సమీపంలో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని చేబ్రోలు పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం కొమ్మమూరు కాల్వ సమీపంలోని మురుగు కాలువలో యువకుడి మృతదేహం ఉందని పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. 30 ఏళ్లలోపు వయసు ఉంటుందనీ, మృతదేహంపై లేత గులాబీ రంగు చొక్కా, నేవీ బ్లూ ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు 8688831384 నంబరుకు సంప్రదించాల్సిందిగా ఎస్సై సూచించారు.

చిత్రకళకు ప్రాణం పోసిన దామెర్ల



సభలో ప్రసంగిస్తున్న ఆచార్య సురేష్ కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన మహా కళాకారుడు దామెర్ల రామారావు అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆర్ట్స్, లా కళాశాల ప్రచార్యులు ఆచార్య ఎమ్.సురేష్ కుమార్ కొనియాడారు. గురువారం తెలుగువారి వైభవాన్ని తన చిత్రాలతో చూపిన మహా కళాకారుడు "దామెర్ల రామారావు" శత వర్థంతిని పురస్కరించుకొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని లలిత కళల విభాగంలో సంస్మరణ సభను ఆచార్య ఎమ్.సురేష్ కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణిక, సామాజిక జీవన స్థితిగతులకు ప్రతిరూపాలుగా దామెర్ల రామారావు గీసిన చిత్రాలు నిలుస్తున్నాయని తెలిపారు. రామారావు గీసిన చిత్రాలు తెలుగువారి ఔన్నత్యానికి ప్రతీకని పేర్కొన్నారు. ఆధునిక, సంప్రదాయ చిత్రకళా రీతులను సమన్వయించి పాశ్చాత్య కళారీతుల్ని శోధించి ఆంధ్ర చిత్రకళకు ప్రాణం పోసిన చిత్రకారుడు దామెర్ల అని చెప్పారు. నేటి లలిత కళల విభాగ విద్యార్థులు దామెర్ల రామారావుని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. లలిత కళల విభాగం అధ్యాపకులు జాన్ రత్నబాబు, శ్రీనివాసరావు, పి. దేవకాంత్, బి.శేఖర్ బాబు, పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123,132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

1,33,176 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,36,176 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,33,176 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 74,902 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13600	334	9500	11500
నెంబరు. 5	10000	13300	నెంబరు.5	--	--
273	10500	12000	273	10000	10000
341	10000	14700	341	13200	13200
4884	9500	12000	4884	--	--
సూపర్ 10	10500	14000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	11000	10000
బ్యాడిగి	10000	13500	బ్యాడిగి	9000	12000
దేవనూరు డీలక్స్	10000	13000	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4000	7500	తెల్లకాయలు	4000	7500

ఆలపాటి నామినేషన్‌కు తరలిరండి : మైనేని మురళీకృష్ణ

కొల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరులో శుక్రవారం నామినేషన్ వేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరులోని విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే భారీ ర్యాలీకి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని గురువారం ఆయన కోరారు.

పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు కోరారు. మండల వ్యాప్తంగా 14 గ్రామపంచాయతీలలోని పట్టభద్రులకు సంబంధించి మొత్తం 1217మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 798, స్త్రీలు 419 మంది ఉన్నట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల రక్షణకు చర్యలు

● మున్సిపల్ కమిషనర్

బాపట్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ స్థలాల రక్షణకు చర్యలు తీసుకుంటామని బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక శ్రీనివాస్‌నగర్ రెండోలైన్‌లోని ప్రభుత్వ భూమి అక్రమణకు గురైన విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ స్పందించారు. ఆ స్థలంలో గురువారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెస్టారెంట్లలో తనిఖీలు

బాపట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రెస్టారెంట్‌లలో నాణ్యతతో కూడిన మంచి ఆహారాన్ని అందించాలని మూడు జిల్లాల ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రభాకర్ అన్నారు. మున్సిపల్ అధికారులతో కలిసి గురువారం బాపట్లలోని పలు రెస్టారెంట్‌లలో ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దని రెస్టారెంట్‌ల నిర్వాహకులకు చెప్పారు. పట్టణంలోని అన్ని రెస్టారెంట్‌లలో ఆహారంలో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అమృతలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి గురువారం తెలుగుదేశం పార్టీ తరఫున ఆర్థికసాయం అంద జేశారు. మండంలోని కూచిపూడికి చెందిన చిలుమూరి వీరయ్య ఇల్లు షార్ట్‌సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోయింది. వీరయ్యకు టీడీపీ తరఫున రూ.25 వేల ఆర్థికసాయంను నాయకుడు యలవర్తి బ్రహ్మానందం చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో తుమ్మల భుజంగరావు, మట్లపూడి జయపాల్, ఆనంద్ పాల్గొన్నారు.

గ్యాస్ ఏజెన్సీ, రైస్ గోడౌన్లలో జేసీ ఆకస్మిక తనిఖీ

బాపట్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీ రైస్ గోడౌన్లను జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని తిరుమల గ్యాస్ ఏజెన్సీలో తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. దీపం పథకం సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈకేవైసీ చేయించుకోని లబ్ధిదారులతో చేయించాలని సూచించారు. అదేవిధంగా రైస్ గోడౌన్‌ను ఆర్డీవో గ్లోరియా, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, డీటీ ఫణికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మైక్రోస్కోప్‌పై అవగాహన

బాపట్ల రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బాపట్ల కాలేజి ఆఫ్ ఫార్మసీలో మొదటి సంవత్సరం ఫార్మా డీ, బీ ఫార్మసీ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ ట్రైనో క్యూలర్ మైక్రోస్కోప్‌పై గురువారం హాండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగామ్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. అడ్వాన్స్‌డ్ ట్రైనో క్యూలర్ మైక్రోస్కోప్‌పై లారెన్స్ అండ్ మాయో టెక్నికల్ ఇంజనీర్ కె.ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారన్నారు. ట్రైనోక్యూలర్ మైక్రోస్కోప్ లేటెస్ట్ వర్షన్‌పై అవగాహన ఎంతో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అభినందించారు.

హామీల అమలుకు వినతి

కొల్లూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలు సమ్మెబాట పట్టిన తరుణంలో గత ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఏపీ అంగన్వాడీ అండ్ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ఎలిజబెత్ రేఖ డిమాండ్ చేశారు. కొల్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కీమ్ వర్కర్లపై జరుగుతున్న రాజకీయ వేధింపులు ఆపాలని అన్నారు.

రవిచంద్ర భౌతికకాయానికి ఎమ్మెల్యే వేగేశన నివాళి

బాపట్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక భీమావారిపాలెంకు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి రామిడి రవిచంద్ర అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ గురువారం రవిచంద్ర భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నాయకులు జిట్టా ప్రమీలారాణి, శీలం శ్రీనివాసరావు, భీమా కోటేశ్వరరావు, జనసేన నాయకులు అంజనేష్ పాల్గొన్నారు.

ఆలపాటిని అఖండ మెజారిటీతో గెలిపించాలి

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరులో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు. స్థానిక టీడీపీ కూటమి శ్రేణుల సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి బాపట్ల పార్లమెంటరీ స్థాయి తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షత వహించారు. ఆనందబాబు మాట్లాడుతూ ఆలపాటి విజయానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో వేమూరు, తెనాలి నియోజకవర్గాల పాత్ర ప్రధానంగా కనపడాలన్నారు. తెనాలి నియోజకవర్గ పరిధిలో 23 వేల గ్రాడ్యుయేట్స్ ఓట్లు ఉండగా వాటిలో వేమూరు నియోజకవర్గానికి సంబంధించిన వారు నాలుగు వేలకు పైగా ఉన్నారన్నారు. వేమూరు నియోజకవర్గపరిధిలోని ఐదు మండలాల్లో 9 వేల మంది ఓటర్లు ఉన్నారని, నూరుశాతం పోలింగ్ జరిగేందుకు కూటమి శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవా లని చెప్పారు. ప్రతి 30 మంది ఓటర్లకు ఒక నాయకుడు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఓటరును కలిసి కూటమి ప్రభుత్వం సాధించి న విజయాలను, అభివృద్ధి సంక్షేమ పథకాల అమ లు తదితర విషయాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గుంటూరులో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో జరిగే భారీ ర్యాలీకి కూటమి శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు దండే వెంకట సుబ్బారావు, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, బీజేపీ నాయకులు మందా జనార్దన్, సాంబశివరావు, జనసేన నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, సుధాకర్, మన్నె పసి, కేసాని శివకృష్ణ, మండల పరిధిలోని కూటమి శ్రేణులు హాజరయ్యారు.



నందిరాజుతోటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ఎమ్మెల్యే వేగేశన ఇంటింటి ప్రచారం

బాపట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో పట్టణంలో, మండలంలోని నందిరాజుతోటలో గురువారం ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు రూపానందరెడ్డి, బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, బాపట్ల మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, నందిరాజుతోట టీడీపీ అధ్యక్షుడు కందుల బాలకోటేశ్వరరావు, మరీదు వెంకటేశ్వర్లు, సబ్బినేని కిషోర్, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాల మెరుగునకు జీరో పావర్టీ పీ-4

● రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరి విజయానంద్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ

బాపట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దారిద్ర్యరేఖకు దిగువనున్న పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు జీరో పావర్టీ పీ-4 విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరి విజయానంద్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ జె.వెంకటమురళి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరికాన్ని రాష్ట్రంలో సమూలంగా నిర్మూలించాలనే దిశగా ప్రభుత్వం అడుగులు ముందుకేస్తుందని ప్రభుత్వ చీఫ్ సెక్రటరి పేర్కొన్నట్లు చెప్పారు. జీరో పావర్టీ పీ-4 విధానానికి అత్యంత ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో పనిచేయనుందని, ఎన్జీవోలు, ఎన్‌ఆర్‌ఐలు, వ్యాపారు లు, స్థానిక నాయకులు, వివిధ రంగాల్లోని నిపుణులను భాగస్వామ్యం చేయడం ద్వారా వారి నైపుణ్యం, వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 7 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే సర్వేలో పౌరులను భాగస్వామ్యం చేసే లక్ష్యంతో మార్గదర్శకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పేదకుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్-2047 కోసం నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బంగారుపతక గ్రహీత అనురాధరెడ్డికి సన్మానం



అనురాధరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు రూపానందరెడ్డి

కర్లపాలెం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న, బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి పిట్టు అనురాధరెడ్డిని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో పాటు టీడీపీ శ్రేణులు గురువారం ఘనంగా సన్మానించారు. భారతదేశం టీమ్ తరఫున ఆడి బంగారు పతకం సాధించి అనురాధరెడ్డి జిల్లాకు పేరుప్రఖ్యాతలు తెచ్చిపెట్టిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు. ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మీ శ్రీనివాసరెడ్డి దంపతులు అనురాధరెడ్డిని టాప్‌లైన్ కారులో కర్లపాలెం వీధుల్లో ఊరేగించారు. కాగా, నేపాల్ ఇట్‌హార్‌లో జరిగిన సెకండ్ ఏషియన్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్-2025లో నేపాల్ టీమ్‌పై తలపడ్డ ఇండియా టీమ్ తరఫున ఆడిన అనురాధరెడ్డి విశేష ప్రతిభ కనబరిచారు. ఏట్రవారిపాలెంకి చెందిన పిట్టుసుబ్బారెడ్డి నాగలక్ష్మి కుమార్తె అనురాధరెడ్డి. ఇంటర్‌లో బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కార్యక్రమంలో బొంతు శివసాంబిరెడ్డి, నక్కల వెంకటస్వామి, ఏపూరి భూపతిరావు, మాడా శ్రీనివాసరావు, బుల్లియ్య, మద్దాల మునలయ్య, చీరాల శ్రీనివాసరెడ్డి, పఠాన్ అహ్మద్‌బాషా, చిన్న తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

● 80గ్రా బంగారం, రూ.లక్షా 50 వేలు స్వాధీనం
● డీఎస్పీ జగదీష్‌నాయక్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న క్రైమ్ డీఎస్పీ జగదీష్

రేపల్లె, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బాపట్ల, కృష్ణా జిల్లాల్లోని పలు గృహాల్లో దొంగతనాలకు పాల్పడ్డ ఇద్దరిని అరెస్టు చేశామని, వారి నుంచి 80 గ్రాముల బంగారం, రూ.లక్షా 50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు బాపట్ల జిల్లా క్రైమ్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ తెలిపారు. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నిందితులు పలు గృహాల్లో దొంగతనం చేసిన వివరాలను వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ గత ఏడాది నవంబరు 17న పట్టణంలోని 18వ వార్డులో ఆకుల జగదీశ్వరి ఇంట్లో చోరీ జరిగినట్లు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి అరెస్టయిన వారిలో బాల నేరస్థుడు ఒకరు ఉండగా, నిజాంపట్నం మండల ఉప్పు బజార్‌కు చెందిన దాసరి నూతన్‌బాబు మరొక నిందితుడని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసైన ఈ బాలుడు, చిన్న దొంగతనాలతో మొదలుపెట్టి, క్రమంగా తాళాలు వేసిన ఇళ్లను ఎంచుకుని రాత్రి వేళల్లో వాటిని పగులకొట్టి దొంగతనాలకు అలవాటు పడినట్లు తెలిపారు. వీరు గతంలో నిజాంపట్నంలో మూడు, విజయవాడలోని ఒక గృహంలో ఉయ్యూరువారిపాలెంలో కస్తూరివారి వీధి, యనమలకుదురులో, బాపట్లలో పలు గృహల తాళాలు పగలకొట్టి బీరువాల్లో బంగారు వస్తు వులు, నగదు దొంగతనం చేసినట్లు గుర్తించామన్నారు. చోరీ చేసిన వస్తువులను తన స్నేహితుడు దాసరి నూతన్ బాబుకు ఇచ్చి కరిగించి చిన్నచిన్న ముక్కలుగా చేసి విక్రయించినట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు కేసుల్లో 80 గ్రాముల బంగార నగదు, చిన్నచిన్నముక్కలు, రూ.లక్షా యాభై వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం సొమ్ము విలువ రూ.8 లక్షలు ఉంటుందని తెలిపారు.

మా బడి మా దగ్గరే ఉంచాలి



ప్రాథమిక పాఠశాల ముందు ధర్నా నిర్వహిస్తున్న తల్లిదండ్రులు

వేమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా కొన్ని ప్రాథమిక పాఠశాలలు మోడల్ స్కూల్స్‌లో విలీనం అవుతాయన్న సమాచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. మండలంలోని జంపని 8వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 29 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో బీసీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులు ఎక్కువ మంది ఉన్నారు. ఈ పాఠశాలకు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని బీఎఫ్ఎస్ పాఠశాలలో దీనిని విలీనం చేసి మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తారని తెలుసుకున్న తల్లిదండ్రులు గురువారం పాఠశాల ముందు బైఠాయించారు. గంటకు పైగా ధర్నా నిర్వహించారు. 'మా బడి మా దగ్గరే ఉంచాలి' అంటూ నినాదాలు చేశారు. తమ బడిని సుదూర ప్రాంతంలో ఉన్న పాఠశాలలో విలీనం చేసేట్లయితే తమ పిల్లలను బడికి మాన్పించాల్సిన పరిస్థితి వస్తుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆ పరిస్థితి వస్తే కనుక ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల ద్వారా డీఈవో, ఎంఈవోలకు లిఖితపూర్వకంగా తమ అభిప్రాయాలు తెలియజేస్తామని తల్లిదండ్రులు చెప్పారు.

ముగిసిన వైదిక ధార్మిక పరిష్కారాల శిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

బాపట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వైదిక ధార్మిక పరిష్కారాల ద్వారాల అనేక రకాలైన శారీరక, మానసిక రుగ్మతలను రూపుమాపవచ్చునని శ్రీదాత్రేనమః ట్రస్ట్ వ్యవస్థాపకుడు కంభంపాటి చెన్నకేశవ శాస్త్రి అన్నారు. స్థానిక పాండురంగస్వామి ఆలయప్రాంగణంలో 14 రోజులుగా నిర్వహిస్తున్న వైదిక ధార్మిక పరిష్కారాల శిబిరం ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సరైన మార్గంలో ముందుకెళ్లేందుకు సరైన మార్గనిర్దేశం చేసే గురువు అవసరమని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఉంటుందని తెలిపారు. అనంతరం ఈ శిబిరానికి సహకరించిన వారిని ట్రస్ట్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మామిడి రాజశేఖర్, మేడా సత్యనారాయణ, పందిటి రవి, పువ్వాడ సుధీర్, శ్రీనివాస్, సింగయ్య, గంగాభవానీ, పద్మావతి పాల్గొన్నారు.

పూడికతీతకు ప్రతిపాదనలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వేమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : 'పూడిక తీతకు నోచుకోని మైనర్ డ్రెయిన్' అంటూ ఈ నెల 2న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై తెనాలి సబ్ డివిజన్ డ్రైనేజ్ శాఖ అధికారులు స్పందించారు. యడవూరు డొంక నుంచి జంపనిలోని రేపల్లె డ్రెయిన్ వరకు ఆక్రమణలు తొలగించేందుకు రెవెన్యూ శాఖ మండల అధికారికి పంచాయతీరాజ్‌శాఖ గ్రామ కార్యదర్శికి ప్రత్యేక చర్యల నిమిత్తం లేఖ రాశారు. సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించిన తక్షణమే కాల్వలో అడ్డుగా ఉన్న చెట్ల పొదలను తొలగిస్తూ పూడికతీత తీసేందుకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో రికార్డుల నిర్వహణ తప్పనిసరి

రేపల్లె, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రతిస్కానింగ్ సెంటర్లో క్లినికల్ పీసీపీఎన్ డీటీ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. సబ్‌డిస్ట్రిక్ లెవన్ మల్టీమెంబర్ అప్రోప్రియేట్ అథారిటి కమిటీ, సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వైజరీ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులకు ఆర్ఎంపీ స్క్రిప్ట్‌తో స్కానింగ్ చేయకూడదని, ప్రతి స్కానింగ్ సెంటర్లో రికార్డు మెయింటినెన్స్ తప్పనిసరి అని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో, కాలేజీలలో పీసీపీఎన్‌డీఈపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, డాక్టర్‌లు భూషన్‌రావు, వి.వీరరాఘవయ్య, సుధాకరన్, శ్వేత, కృష్ణచైతన్య, రమేష్, జాన్‌ప్రసాద్, షేక్ షాహీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్‌డీ కుమారస్వామికి డీఎల్‌పీవోగా అదనపు బాధ్యతలు

చుండూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల ఈవోపీఆర్‌డీ కుమారస్వామికి జిల్లా డీఎల్‌పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మండల సర్పంచులు, పార్టీల నాయకులు గురువారం ఆయనను అభినందించి, సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచులు సంఘం మండల అధ్యక్షుడు, మున్నంగివారిపాలెం సర్పంచ్ అమ్మిశెట్టి శ్రీరామమూర్తి మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే అధికారికి డీఎల్‌పీవోగా అదనపు బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలపాడు సర్పంచ్ చేబ్రోలు విజయలక్ష్మి, పెనుగుదురుపాడు మాజీ సర్పంచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సర్వేలన్నీ సకాలంలో పూర్తిచేయాలి

● ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న సర్వేలన్నింటిని అధికారులు సమయపాలన పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని యాజలి, పాతనందాయపాలెంలోని అంగన్వాడీ సెంటర్లు, కమ్యూనిటి హెల్త్ సెంటర్లను గురువారం ఆయన సందర్శించారు. సిబ్బందికి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు వీరాస్వామిరెడ్డి, మురళీ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

అమృతలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగించుకోవాలని టీడీపీ నాయకుడు బ్రహ్మానందం అన్నారు. మండలపరిధిలోని ప్యాపర్రులో హెల్ప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని యలవర్తి బ్రహ్మానందం, కూచిపూడి డీసీ కొరటాల లీల సత్యసాయి గురువారం ప్రారంభించారు. 126 మందికి గుండె పరీక్షలు నిర్వహించగా, అందులో 16 మందికి ఏంజియోగ్రామ్ పరీక్ష నిమిత్తం విజయవాడ హెల్ప్ హాస్పిటల్‌కు తరలిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో అచ్చన వెంకటేశ్వరరావు, ఉడతా దేవేంద్రబాలాజీ, వన్నా బెనర్జీ, షేక్ చిన్నజానీ, క్రొత్తపల్లి రవీద్రబాబు, శరణు గిరి, దేవకుమార్, వెంకటసుబ్బారావు, బొల్లెద్దు బాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

కర్లపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ బాల స్వస్తిక్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పలు వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఎత్తు, బరువు, కంటి, రక్తపరీక్షలు నిర్వహించారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

● ఎస్పీ తుషార్‌డూడీ



ఎస్ఐ రవీంద్రను వివరాలను అడుగుతున్న ఎస్పీ తుషార్‌డూడీ

కర్లపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : నేరనియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం అని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. కర్లపాలెం పోలీసుస్టేషన్‌ను గురువారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో జరిగిన నేరాలు గురించి ఆరాతీశారు. పోలీసు సిబ్బందితో ఒక్కొక్కరితో మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు, శాఖాపరంగా ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించాలని అన్నారు. దొంగతనాలు, ఇతర ప్రాపర్టీ నేరాలు నియంత్రణకు గస్తీ ముమ్మరం చేయాలన్నారు. తనిఖీలో ట్రైనీ డీఎస్పీ అభిషేక్, రూరల్ సర్కిల్ సీఐ హరికృష్ణ, కర్లపాలెం ఎస్ ఐ రవీంద్ర పాల్గొన్నారు.

రొయ్యల చెరువులకు బీమాతో రైతులకు మేలు

● జిల్లా మత్స్యశాఖాధికారి బి.కృష్ణకిషోర్



ఆక్వా ఇన్సూరెన్స్ గురించి వివరిస్తున్న జిల్లా మత్స్యశాఖాధికారి బి.కృష్ణకిషోర్

కర్లపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రొయ్యల సాగు చేస్తున్న రైతులు తమ పంటలకు బీమా చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని జిల్లా మత్స్యశాఖాధికారి బి.కృష్ణకిషోర్ అన్నారు. కర్లపాలెంలోని శ్రీవాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఎన్ఎఫ్‌డీబీ మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆక్వా రైతులకు ఆక్వా ఇన్సూరెన్స్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కృష్ణకిషోర్ మాట్లాడుతూ హెక్టార్‌కు రూ.25 వేలు చొప్పున 4 హెక్టార్లకు గరిష్ఠంగా లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లినప్పుడు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. కార్యక్రమంలో నక్సా రాష్ట్ర కోఆర్డినేటర్ కె.కిరణ్, ఎన్ఎఫ్‌డీబీ సీనియర్ కన్సల్టెంట్ షేక్ సల్మా, నిజాంపట్నం ఏడీ సైదానాయక్, అలయన్స్ ఇన్సూరెన్స్ ఆషారాణి, న్యూఇండియా ఇన్సూరెన్స్ అనిత, బైలయ్య, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి కిషోర్‌రెడ్డి, షేక్‌సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వంద మంది మాస్టర్ వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి.అర్చన

బాపట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : 'మత్తు విమోచిత భారత దేశం' కార్యక్రమంలో భాగంగా వంద మంది మాస్టర్ వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. మత్తు నియంత్రణ, జీవిత నైపుణ్యాలపై ఈ శిక్షణ ఇచ్చారు. సామాజిక రక్షణ జాతీయ సంస్థ, సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వశాఖ, గ్రీన్‌వాలీ ఫౌండేషన్-విశాఖపట్నం సమన్వయంతో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జి. అర్చన తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన



బాపట్ల మున్సిపల్ హైస్కూల్లోని పోలికేంద్రాలను పరిశీలిస్తున్న బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, రెవెన్యూ సిబ్బంది

బాపట్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెలలో జరగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక మున్సిపల్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను పోలీస్, మున్సిపల్ అధికారులతో కలిసి గురువారం బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, సీఐ ఆర్ రాంబాబు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు

రేపల్లె, ఫిబ్రవరి 6(ఆంధ్ర జ్యోతి): సమష్టి కృషితో ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను విజయవంతం చేద్దామని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేపల్లె డివిజన్‌లో 22 పోలీస్ డివిజన్‌లు ఉన్నాయని తెలిపారు. ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పోలీసులు బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికలకు రెండు రోజుల ముందే ఆయా పోలింగ్ బూత్‌లను పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులు పరిశీలించి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.సమీక్షలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావు, తహసీల్దార్లు ఏఈఆర్‌వోలు డివిజన్‌లోని ఎస్ఐలు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు

● పటిష్ట బందోబస్తుతో మహాశివరాత్రి ఏర్పాట్లు



అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న దేవదాయ శాఖ డీసీ కేవీ శ్రీనివాసరావు

రేపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు జిల్లాలోని పలు శివాలయాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నట్లు దేవదాయ శాఖ డీసీ కేవీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలో ని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి దేవాలయం, కొల్లూరు మండలం కోటిపల్లి సోమేశ్వరస్వామి దేవాలయాలను గురువారం ఆయన సందర్శించారు. దేవాలయాల సమీపంలో చలువ పందిళ్ళు క్యూలైన్ల కోసం భారీ గేట్లు, భక్తులకు మంచినీరు, అభిషేకం చేసుకునేవారికి తగిన వసతులు కల్పించాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్ కుమార్‌బాబు, ఈవోలు దివి వెంకట అప్పలాచార్యులు, మేకా సాంబశివరావు, అర్చకులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.69 వేల 883

బాలకోటేశ్వరస్వామి దేవాలయంలో హుండీలో వచ్చిన డబ్బును లెక్కించగా రూ.69,883 వచ్చిందని దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి దివి అప్పలాచార్యులు తెలిపారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ.34,241 అధికంగా వచ్చినట్లు చెప్పారు. అనంతరం కొబ్బరిచిప్పల పాట నిర్వహించగా రూ.39 వేలకు పోయిందని, గతం కంటే రూ.11వేలు అధిక ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

దూరవిద్య కేంద్రం పీజీ ఫలితాలు విడుదల


పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో గత అక్టోబరు, నవంబరులో నిర్వహించిన పీజీ కోర్సులు పరీక్షల ఫలితాలను గురువారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కే రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జీ. సింహాచలంలు విడుదల చేశారు. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డీ.రామచంద్రన్ మాట్లాడుతూ 1,2,3,4 సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసామన్నారు. ఎంహెచ్ఆర్ఎం, ఎంఎల్ఐఎస్‌సీ, సోషల్ వర్క్, ఇంగ్లిష్, ఎకనామిక్స్, హిందీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సంస్కృతం, సోషియాలజీ, జర్నలిజం, ఎంకామ్ కోర్సుల ఫలితాలు విడుదలైనట్లు తెలిపారు.

దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫలితాలను దూరవిద్యకేంద్రం వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షల అసిస్టెంట్ రిజిస్ట్రార్ డీ.కోదండపాణి మాట్లాడుతూ విద్యార్థులు రీవాల్యుయేషన్ చేయించుకోవాలంటే ఆయా దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఒక్కో పేపరుకు రూ. 960 ఈ నెల 24లోగా చెల్లించి దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్‌కు దరఖాస్తు పంపాలన్నారు.

కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య రవికుమార్, ఆచార్య త్రిమూర్తిరావు, పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైను లాబ్దిన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, సిబ్బంది టంక శాల వెంకటేశ్వర్లు, సీటీఏలు లావణ్య, ఉమామహేశ్వరరావు, వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక

పెదకాకాని,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): బైబిలు మిషను స్త్రీల సభల కన్వీనర్, రెండో శనివారం ఉపవాస ప్రార్థనల వ్యవస్థాపక నిర్వాహకులు డాక్టర్ జే. ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక శుక్రవారం ఉదయం 10 గంటలకు పెదకాకాని స్వస్థిశాలలో ప్రారంభమౌతుందని ఆమె కుమారుడు, బైబిలుమిషను అధ్యక్షుడు జే.శామ్యేల్ కిరణ్, కుమార్తె అనీలా జోషి బైబిలుమిషను అధికారులు గురువారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఇప్పటికే కూడిక ఏర్పాట్లు పూర్తయి నట్లు వెల్లడించారు.


ప్రమీల సెల్వరాజ్ (ఫైల్)

భక్తి, సేవకు అంకితం ప్రమీలా సెల్వరాజ్..

ప్రమీలా సెల్వరాజ్ చిన్నతనం నుంచే దైవభక్తి, ప్రార్థనల పట్ల ఆసక్తి కనబర్చారు. బైబిలు మిషను స్థాపకుడు ఫాదర్ ఎం. దేవదాస్ అయ్య ప్రభావంతో ఆ మార్గంలో ముందుకు సాగారు. గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. అనంతర కాలంలో ఆమె బైబిల్ మిషన్ 7వ అధ్యక్షుడు జే. జాన్ సెల్వరాజ్‌ని వివాహం చేసుకున్నారు. వారి కుటుంబం పూర్తిగా దైవ సేవకు అంకితమైంది. ప్రమీలా సెల్వరాజ్ బైబిలు మిషను, గుంటూరు, బేతేలు గృహం ప్రధాన కేంద్రంగా దేశవ్యాప్తంగా అనేక మంది క్రైస్తవ విశ్వాసుల ప్రేమలను పొంది, బైబిల్ మిషన్ స్త్రీల సభలను 38 సంవత్సరాలుగా ప్రతి యేటా సెప్టెంబరులో సమర్థవంతంగా నిర్వహిస్తూ వచ్చారు. ఆమె 1987లో ఏర్పాటుచేసిన రెండో శనివారం ఉపవాస ప్రార్థనలు ఇప్పటికీ తోటలో కొనసాగుతున్నాయి.

దేశవ్యాప్తంగా అనేక మంది భక్తులు కాకాని స్వస్థిశాలకు వచ్చి, దైవదీవెనలు పొందేవారు. పెదకాకాని తోటలో ప్రతి సోమవారం స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తూ, వ్యాధి, బాధలలో ఉన్నవారికి ఓదార్పునిస్తూ, ధైర్యపరుస్తూ ఎందరో విశ్వాసులకు ప్రమీలా సెల్వరాజ్ ఆత్మీయ మార్గదర్శిగా నిలిచారు.

నామినేషన్లకు రెండు రోజులే..

- 7, 10 తేదీల్లో మాత్రమే అవకాశం
- 8, 9 తేదీల్లో రెండో శని, ఆదివారం సెలవుదినాలు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల ఘట్టం తుది దశకు చేరుకొంది. 10వ తేదీ నామినేషన్ల దాఖలుకు ఆఖరు అయినప్పటికీ మధ్యలో రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో శుక్ర, సోమవారం మాత్రమే అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. దీంతో ఈ రెండు రోజుల్లో ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వస్తారని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రధాన అభ్యర్థులైన ఎన్డీయే కూటమి బలపరిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఉదయం నామినేషన్ అందజేయనున్నారు. మరోవైపు సిట్టింగ్ పీడీఎఫ్ బలపరిచిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సోమవారం నామినేషన్ వేస్తారని ఆయన కార్యాలయవర్గాలు తెలిపాయి. దీంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయా లని పోలీసులకు ఆదేశాలు అందాయి.

ఈ నియోజకవర్గానికి నామినేషన్ల స్వీకార ప్రక్రియ ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఇప్పటివరకు తొమ్మిది మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సెలవు దినాల్లో నామినేషన్లను స్వీకరించరు. ఈ నేపథ్యంలో 8, 9వ తేదీల్లో అధికారులు నామినేషన్లను తీసుకోరు. దీని దృష్ట్యా శుక్ర, సోమవారాల్లోనే నామినేషన్ పత్రాలను ఆర్‌వో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని ఆర్‌వో ఎస్ నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

ఎమ్మెల్సీ ఎన్నికలనిర్వహణ కోసం గుంటూరు కలెక్టరేట్‌లో 24గంటలు పనిచేసేలా కంట్రోల్ రూంని ఏర్పాటు చేశారు. నంబరు. 0863 2979766ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు చేయడానికి, ఎన్నికల సమాచారం తెలుసుకోవడానికి కంట్రోల్‌రూంకి ఫోన్ చేయవచ్చని సూచించారు.

ఉద్యాన పంటలకు ఊతం





- ప్రభుత్వం నుంచి భారీగా రాయితీలు
- అధిక దిగుబడి.. మంచి లాభాలు
- సాగుకి ఆసక్తి చూపుతున్న రైతులు
- మండలంలో అధిక మొత్తంలో సాగు

ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా ప్రోత్సాహక రాయితీలు అందిస్తోంది. దీంతో అధిక సంఖ్యలో రైతులు ఉద్యాన పంటల సాగు వైపు మళ్లుతున్నారు. ముఖ్యంగా యువ రైతులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, అర్వపల్లి, పమిడిమర్రు, కొండకావూరు, గురవాయపాలెం గ్రామాలలో రైతులు ఉద్యాన పంటలసాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎప్పుడూ సాగుచేసే మిరప, పత్తి, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు ఉద్యాన పంటలను సాగు చేసి అధిక లాభాలను ఆర్జిస్తున్నారు.

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలంలో రైతులు ఇటీవల అత్యధికంగా డ్రాగన్‌ఫ్రూట్, అరటి, బొప్పాయి పంటలను సాగుచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రాగన్‌ఫ్రూట్ సాగుచేస్తున్న రైతులకు గతంలో 1 హెక్టారుకు 3 సంవత్సరాలకు ప్రోత్సాహక రాయితీగా రూ.30 వేలు అందిస్తుండగా ఈ సంవత్సరం నుంచి రూ. 2.7 లక్షలు అందిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. మామిడి, స్వీట్ ఆరెంజ్, సిట్రస్ వంటి పండ్ల తోటలు సాగుచేస్తున్న రైతులకు గతంలో 1 హెక్టారుకు 3 సంవత్సరాలకు రూ.15 వేలు అందిస్తుండగా ఈ ఏడాది నుంచి రూ 50 వేలు అందించనున్నారు. అలాగే అరటి, సపోటా, జామ, ఆపిల్, జాక్‌ఫ్రూట్ పంటలను సాగుచేస్తున్న రైతులకు గతంలో 1 హెక్టారుకు రూ. 30 వేలు అందిస్తుండగా ఈ ఏడాది నుంచి రూ.70 వేలు ఇవ్వనున్నారు. దీంతో అధిక శాతం మంది రైతులు ఉద్యాన పంటలను సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. నరసరావుపేట మండలంలో మామిడి 90 హెక్టార్లు, దొండ తోటలు 80 హెక్టార్లు, టమాటా తోటలు 60 హెక్టార్లు, వంగ తోటలు 30 హెక్టార్లు, బంతి, చామంతి, లిల్లీ, కనకాంబరాలు పూలతోటలు 20 హెక్టార్లు, జామ, సపోటా, దానిమ్మ, అరటి తోటలు 50 హెక్టార్లలో సాగు అవుతున్నాయి. ఉద్యాన శాఖ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఆయా పంటలపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలపై అవగాహన కలిగిస్తున్నారు. తద్వారా ఉద్యావన పంటల సాగు వైపు యువ రైతులు ఆసక్తి కనబరిచేలా కృషి చేస్తున్నారు.


ఉప్పలపాడు గ్రామంలో డ్రాగన్‌ఫ్రూట్ రైతులకు అవగాహన కలిగిస్తున్న జిల్లా ట్రైయిని కలెక్టర్ కల్పన శ్రీ, ఉద్యానశాఖ అధికారులు (ఫైల్ ఫోటో)





కూరగాయల సాగులో అధిక దిగుబడి



ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీలతో కూరగాయల తోటలు సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాం. ఉప్పలపాడు గ్రామంలో టమాటా, వంగ, దొండ, మిరప సాగు చేస్తున్నాను. గతంలో కంటే ఇప్పుడు పంటల దిగుబడి బాగుంది. ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు మా తోటలను పరిశీలించి తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

తన్నీరు నాగేశ్వరరావు, రైతు, ఉప్పలపాడు

డ్రాగన్ ఫ్రూట్ సాగు లాభదాయకంగా ఉంది



డ్రాగన్ ఫ్రూట్ తోటలు సాగుచేస్తున్నాను. మిర్చి, పత్తి, వరి పంటల కంటే పెట్టుబడి ఖర్చు, శారీరక శ్రమ కూడా తక్కువే. డ్రాగన్ ఫ్రూట్ ధర మార్కెట్‌లో అధికంగా ఉంటుంది. దీంతో ఈ సాగు రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంది. డ్రాగన్ ఫ్రూట్ పంటలను సాగు చేస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు రూ. 2.7 లక్షలు రాయితీని ప్రకటించింది.

- షేక్ సాంబశివరావు, రైతు, అర్వపల్లి

విజ్ఞాన్ మహోత్సవం 2కె25





సంగీత దర్శకులు ఎస్ఎస్ తమన్‌తో డాక్టర్ లావురత్తయ్య, తులసీరెడ్డి తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చూసేందుకు రెండు కళ్లు చాలనంత.. యువత గుండెల నిండా స్ఫూర్తి నింపేంత ప్రోత్సాహం. మది పులకించేలా సంగీత, సాంస్కృతిక హోరు. యువత ఆటలు, పాటలు, తుళ్లింతలు.. కేరింతలల నడుమ జాతీయ స్థాయి విజ్ఞాన్స్ మహోత్సవ్ గురువారం ప్రారంభమైంది.

చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ప్రారంభమైన ఈ వేడుకలకు భారీ సంఖ్యలో యువత హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ మాట్లాడుతూ యువత చదువుకే పరిమితం కాకుండా సంగీతం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. చదువుతోపాటు సామాజిక సేవ, సానుకూల దృక్పథంతో మెరుగైన అవకాశాలు వస్తాయన్నారు. ఈనెల 15న విజయవాడలో జరగనున్న ఎన్టీఆర్ ట్రస్ట్ చారిటీ షోలో పాల్గొనాలని విద్యార్థులను కోరారు. గౌరవ అతిథిగా హాజరైన తులసి రెడ్డి మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా వున్న సృజనాత్మను వెలికి తీయడానికే ఈ మహోత్సవాలన్నారు. చదువు అంటే పుస్తకాలు ఒక్కటే కాదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పాఠ్యాంశాలేనన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రసంగిస్తూ మహోత్సవాలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఒకరితో మరొకరు ఎలా మెలగాలి? బృంద సమూహంగా ఎలా పనిచేయాలనే విషయాలు తెలుస్తాయన్నారు. ఎవరైతే ఇటువంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారో వారే అందరికంటే ముందుగా జీవితంలో స్థిరపడతారన్నారు. వేడుకల్లో వీసీ ఆచార్య పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్ సీఈవో డాక్టర్ మేఘన తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం కార్యక్రమానికి హీరో విశ్వక్‌సేన్, హీరోయిన్ ఆకాంక్ష శర్మ, యాక్టర్ అభిమన్యు సింగ్ రానున్నారు.


జ్యోతి వెలిగించి వేడుకల్ని ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య.

మహోత్సవ్‌లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించారు. తొలుత నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్, ఫుట్‌బాల్, హాకీ, తైక్వాండో, ఖోఖో, ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్, యోగాసన వంటి తదితర క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో విద్యార్థులకు పోటీలు ప్రారంభించారు. వీటితో పాటు మ్యూజిక్, లిటరసీ, స్పాట్‌లైట్, డాన్స్ డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్‌మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కల్చరల్స్, థియేటర్ ఆర్ట్స్ తదితర పోటీలు నిర్వహించారు.

విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు




పల్నాడు ఎక్స్‌ప్రెస్ లోకో ఫెయిల్యూర్

- 2 గంటల 25 నిమిషాలు ఆలస్యంగా వికారబాద్‌కు చేరిక
- దీని ప్రభావంతో రిటర్న్ పల్నాడు రీషెడ్యూల్
- తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ఎక్స్‌ప్రెస్ గురువారం ప్రయాణికులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. నంబరు. 12747 గుంటూరు నుంచి వికారాబాద్‌కు వేకువజామున 5.45కి బయలుదేరిన ఈ రైలు లోకో(ఇంజిన్)లో సాంకేతికలోపం తలెత్తింది. పిడుగురాళ్ల - నడికుడి సెక్షన్‌లో సమస్య తలెత్తడంతో అక్కడే గంటన్నరకు పైగా ఆలస్యమైంది. ఇక నల్గొండ - సికింద్రాబాద్ సెక్షన్‌లో మరింత ఆలస్యం కావడంతో దాదాపుగా 3.30 గంటల ఆలస్యంగా సికింద్రాబాద్‌కు చేరింది. అక్కడి నుంచి బయలుదేరి గమ్యస్థానమైన వికారాబాద్‌కు 2 గంటల 25 నిమిషాల ఆలస్యంగా చేరుకొంది. ఈ కారణంగా రిటర్న్ పల్నాడు ఎక్స్‌ప్రెస్ నంబరు. 12748 వికారాబాద్ - గుంటూరు రైలుని గంట 40 నిమిషాల ఆలస్యంగా బయలుదేరేలా రీషెడ్యూల్ చేశారు. అయితే ఆ సమయంలో రెగ్యులర్ రైళ్లకు పాత్ ఉండటంతో 10 గంటలకు కూడా మిర్యాలగూడ చేరుకోలేదు. ఈ రైలు గుంటూరుకు చేరుకోవడానికి అర్ధరాత్రి 12 గంటలు అవుతుందని రైల్వే ఎంక్వయిరీ సిబ్బంది తెలిపారు. దీంతో ఉదయం ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లిన ప్రయాణీకులు, మధ్యాహ్నం అటు నుంచి గుంటూరుకు బయలుదేరి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో దిగి వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణీకులకు ఆయా స్టేషన్లలో లింకు బస్సులు వెళ్లిపోవడంతో చేసేది లేక ఆటోలలో బయలుదేరాల్సిన పరిస్థితి తలెత్తింది.

ఆరబెట్టిన మిర్చిని తీసుకురావాలి

- రైతులకు మిర్చియార్డు కార్యదర్శి చంద్రిక సూచన


మిర్చియార్డులో సిబ్బందితో కలిసి పర్యటిస్తున్న సెక్రెటరీ చంద్రిక

గుంటూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులు మిరప కాయలను బాగా ఆరబెట్టిన తర్వాతే మిర్చి యార్డుకు తీసుకురావాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక సూచించారు. గురువారం ఆమె యార్డు సిబ్బందితో కలిసి మార్కెట్ కమిటీ ప్రాంగణంలో పర్యటించారు. పలుచోట్ల కమీషన్ దుకాణాల ఎదుట మిర్చిని ఆరబోసి ఉండటాన్ని ఆమె గమనించారు. రైతులు తీసుకొచ్చే మిర్చిలో తేమ శాతం ఉండకుండా చూసుకోవాలన్నారు. అలానే యార్డు ప్రదేశంలో మిర్చి ఆరబెట్టడం వలన ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం భోజనశాలని సందర్శించి రైతులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతని పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ గ్రేడ్‌ల సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, అంజనేయ సింగ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ 2.0.. ఆమోదం

(5వ పేజీ తరువాయి)

స్థానిక సంస్థ వాటా నిధులను 15వ ఆర్థిక సంఘం నుంచి వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో మునిసిపాలిటీలపై నిధుల భారం తప్పనుంది.

గతంలో నిలిచిన పనులకు మోక్షం

అమృత్ పథకం కింద చిలకలూరిపేటలో రక్షిత మంచి నీటి పథకం విస్తరణ టీడీపీ హయాంలో రూ.145 కోట్లతో చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం నిధులను నిలిపివేయడంతో పనులు ఆగిపోయాయి. దీంతో ఈ పథకాన్ని అమృత్ 2.0 కింద చేర్చారు. రూ.116 కోట్లతో పథకాన్ని పూర్తి చేసేలా అంచనాలను రూపొందించారు. చిలకలూరిపేట తరహాలోనే ఇతర మున్సిపాల్టీలలో నిధుల కొరతతో నిలిచిపోయిన పనులను పూర్తిచేసేందుకు డీపీఆర్‌లు సిద్ధం చేశారు. మున్సిపాల్టీలలో రానున్న 25 ఏళ్ల ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి పథకాలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

కలుషిత జలాలు శుద్ధి..

తాగునీటి పథకాల అభివృద్ధితో పాటు మురుగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అమృత్‌పథకంలో పెద్ద పీట వేస్తున్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపడుతున్నారు. గుంటూరు, నరసరావుపేట పట్టణాల్లో ఇప్పటికే భూగర్భ డ్రెయినేజ్ పథకాలు ఉన్నాయి. మిగతా మున్సిపాల్టీలలో మురుగు నీరు వాగుల్లో కలసి జలాలు కలుషితం అవుతున్నాయి.దీనిని పూర్తిగా నిరోధించేందుకు ప్రతి మున్సిపాల్టీలో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్లాంట్లను నిర్మించి మురుగు నీటిని శుద్ధి చేసిన అనంతరం నీటిని బయటకు పంపుతారు. మునిసిపాలిటీల పరిధిలో ఉన్న తాగునీటి చెరువులను కూడా అభివృద్ధి చేయనున్నారు. భూగర్భ జలాలు పెంచే దిశగా చెరువులను పునరుద్ధరించనున్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యాకుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అద్దంకి మున్సిపాలిటిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నా ప్రభుత్వ పథకాలు అమలు చేయడం లేదని తెలిపారు. దీనితో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో పాటు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నడపలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎస్సీ , ఎస్టీలకు విద్యుత్ రాయితీ అ మలు కావడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి. బిష్మా, లక్ష్మి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం స్పెషల్ డెస్క్ ఏర్పాటు

పంగులూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసినట్లు రేణంగివరం ఎస్ఐ వినోద్ బాబు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల రక్షణ కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. మహిళలు ఏ సమయంలో అయినా డెస్క్‌ను సంప్రదించ వచ్చని, మహిళల రక్షణ కోసం తాము ఎల్ల వేళలా అందుబాటులో ఉంటామని ఎస్ఐ తెలిపారు.



రేణంగివరం పోలీస్ స్టేషన్లో మహిళల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక డెస్క్


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కౌన్సిలర్‌లు

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై న్యాయ విచారణ

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు విషయంలో పారదర్శకంగా విచారణ జరపాలని పలువురు టీడీపీ కౌన్సిలర్‌లు కోరారు. గతంలో జరిగిన అత్యవసర సమావేశంలో విగ్రహం ఏర్పాటుకు స్థలం పరిశీలించి అనంతరం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలనే అంశంపై అజెండాలో ఆమోదం తెలుపగా మాజీమంత్రి డా పాలేటి రామారావు విగ్రహానికి అనుమతి వచ్చిందంటూ వైసీపీ నాయకులతో హడావుడిగా భూమిపూజ చేయించడం అన్యాయమని పేర్కొన్నారు. అలాగే కౌన్సిల్‌కు సంబంధించిన 14 మంది కౌన్సిలర్‌లు మరొక ప్రదేశాన్ని కోరారని, ఈక్రమంలో సమగ్ర విచారణ జరపాలని కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు టీడీపీ కౌన్సిలర్‌లు మించాల సాంబశివరావు, సల్లూరి సత్యానందం, పొత్తూరి సుబ్బయ్య తదితర నాయకులు వినతిపత్రం అందజేశారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 13 పరీక్షా కేంద్రాలు పెంపు
- జిల్లావ్యాప్తంగా 183 పరీక్షా కేంద్రాలు
- ఆరు కేంద్రాలకు సీసీ కెమెరాలు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చేనెల 17వతేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేంద్రాలు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల ఎంపికకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి ఆమోద ముద్ర వేశారు. ఈ ఏడాది పదవ తరగతి రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూలు సొసైటీ విద్యార్థులను కూడా కలిపి ఒకేసారి పరీక్షలు నిర్వహించనున్నారు. గతేడాది రెగ్యులర్ విద్యార్థులకు 170 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఈ ఏడాది ఓపెన్ స్కూలు విద్యార్థులకు ఒకేసారి పరీక్షలు నిర్వహించాల్సి రావడంతో 13 కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 183 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిలైన వారు మొత్తం 29,843మంది పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 29,602 మంది కాగా ఒకసారి ఫెయిలైన వారు 241 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. ఆరు సమస్యాత్మక కేంద్రాలలో కాపీయింగ్‌ను నిరోధించేందుకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఓపెన్ విద్యార్థులకు 23 కేంద్రాలు

జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూలు సొసైటీ విద్యార్థులు 23 పరీక్షా కేంద్రాల్లో కలిసి పరీక్ష రాయనున్నారు. ప్రతి కేంద్రంలో రెండు గదులను ఓపెన్ స్కూలు విద్యార్థులకు కేటాయిస్తారు. ఓపెన్ స్కూలు సొసైటీ రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులు 1,564 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒంగోలు, మార్కాపురంలలో రెండేసి కేంద్రాలు, కనిగిరి, యర్రగొండపాలెంలో ఐదు కేంద్రాలు, దర్శిలో అత్యధికంగా ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా గిద్దలూరులో మూడు కేంద్రాల్లో రెగ్యులర్‌తోపాటు ఓపెన్‌స్కూలు విద్యార్థులు కూడా పరీక్షలు రాసునున్నారు.

ఆరు కేంద్రాలకు సీసీ కెమెరాలు

జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు రాయనున్నారు. సమస్యాత్మక కేంద్రాలుగా ఈ కేంద్రాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పిటికాయగుళ్ల, యేనుగులదిన్నెపాడు, చంద్రశేఖరపురం, యాచవరం, రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఈ పాఠశాలలకు సమర్థులైన అధికారులు, ఉపాధ్యాయులను పరీక్షల విధులకు నియమించమని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ ఆదేశించారు.

అద్దంకిలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

- ఫలిస్తున్న పోలీసుల ప్రణాళికలు
- చిక్కుముడి నుంచి బయట పడుతున్న భవానీసెంటర్
- రోజూ సాయంత్రం విజిబుల్ పోలీసింగ్
- మిగిలిన ప్రాంతాలలో రద్దీ సమయాలలో కానిస్టేబుళ్ల విధులు


భవానిసెంటర్‌లో ట్రాఫిక్ ను పరిశీలిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): అద్దంకి అంటే ట్రాఫిక్ పద్మ వ్యూహం నుంచి బయటపడేదెట్లా అని వాహనచోదకులు బెంబేలెత్తిపోయారు. అయితే పోలీస్ అధికారులు పక్షం రోజులు గా అద్దంకి పట్టణంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో అద్దంకి ఎస్సైలు గా పనిచేసి అద్దంకి పట్టణం పై పూర్తి అవగాహన ఉన్న చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజులు అద్దంకి పట్టణంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. అద్దంకి పట్టణంలో ప్రధాన కూడలిగా ఉన్న భవాని సెంటర్‌పై దృష్టి సారించి ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచిరా త్రి 8 గంటల వరకు ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుల్స్ విధులు నిర్వహించేలా విధులు కేటాయించారు. వీరికి అదనంగా మరి కొంత మంది సిబ్బందిని కూడా తర చూ భవానీ సెంటర్ లో విధులు నిర్వహించేందుకు కొంత సమయాన్ని కేటాయిస్తున్నారు. సీఐ సుబ్బ రాజుతో పాటు ఇద్దరు ఎస్సైలు, ఇతర సిబ్బంది కూడా ప్రతి రోజూ సాయంత్రం సమయంలో ఖచ్చితంగా పట్టణం పరిధిలో విజుబుల్ పోలీసింగ్ నిర్వహించే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో భవానిసెంటర్ లో అడ్డదిడ్డంగా ప్రయాణానికి చెక్ పడింది. మొత్తం 5 రోడ్ల కూడలి కావటంతో అన్ని రోడ్లలో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తూ వాహనాలను క్రమబద్ధీకరిస్తున్నారు. ఇక అదే సమయంలో ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్, ఇన్‌గేట్, రామ్‌నగర్ లలో కూడా వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు కానిస్టేబుళ్లు విధులు నిర్వహించే విధంగా చేశారు. రోడ్డు మార్జిన్‌లు ఆ క్రమించి తోపుడు బండ్లు ఏర్పాటు చేసే వ్యాపారులకు కూడా ముందస్తు సమాచారం ఇవ్వటంతో పాటు ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తుండటంతో కొంత మేర ఫలితం కనిపిస్తున్నది. ఇదే పంథాను కొనసాగిస్తూ ట్రాఫిక్ ఇక్కట్ల నుంచి బయట పడేందుకు మరింత మెరుగైన చర్యలు చేపట్టే దిశలో డీఎస్పీ మొయిన్, సీఐ సుబ్బరాజులు స్థానికులు, వాహనచోదకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నారు. పోలీస్ అధికారుల చర్యలతో అద్దంకిలో ట్రాఫిక్ కష్టాల నుంచి వాహన చోదకులకు కొంత మేర ఉపశమన కలిగినట్లు అయ్యింది.


దర్శి రోడ్డు, ఒంగోలు రోడ్డులలో నుంచి వచ్చే వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్


ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న కానిస్టేబుల్

కర్ణాటక మార్కెట్ హాట్‌హాట్!

- రూ.318 పలికిన కిలో పొగాకు
- ఈ సీజన్‌లో ఇదే అధిక ధర
- మీడియం, లోగ్రేడ్‌లకు అదే పరిస్థితి
- ఇది తాత్కాలికమే అంటున్న నిపుణులు



ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో పొగాకు మార్కెట్ మరోసారి హాట్‌హాట్‌గా సాగుతోంది. వారం పదిరోజుల క్రితం కూటమి కట్టి ధరలపై సీలింగ్ పెట్టి కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం బేళ్ల కోసం పోటీ పడుతున్నారు. దీంతో మేలురకం, మీడియం, లోగ్రేడ్ ఇలా అన్ని రకాల ధరలు గణనీయంగా పెరిగాయి. నాలుగైదు రోజులుగా ఈ పరిస్థితి అక్కడి మార్కెట్లో కనిపిస్తుండగా మేలురకం పొగాకు కిలో గరిష్ఠ ధర గురువారం రూ.318 పలికింది. ఈ సీజన్‌లో ఇదే అధిక ధర కాగా వారం పదిరోజుల క్రితం వరకు ఆ రకం ధరలు కిలో రూ.300 లోపుగానే ఉన్నాయి. అక్కడ ఈ సీజన్‌కు 100 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా ఇంచుమించు అంతమేర రైతులు పండించారు. తొలుత కిలో రూ.230తో కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు తొలి నెల రోజులు ధరలు పెంచకుండానే కొంటూ వచ్చారు. అనంతరం క్రమంగా ధరలు పెరిగి డిసెంబర్‌లో అలా గరిష్ఠ ధర రూ.300లకు, జనవరిలో రూ.315కు పెరిగాయి. సంక్రాంతి అనంతరం తిరోగమనంలో మార్కెట్ నడిచింది. వ్యాపారులు కూటమి కట్టి ధరలను కిలో రూ.300కు సీలింగ్ పెట్టి కొన్నారు. అలాగే మీడియం, లోగ్రేడ్లను కూడా అప్పటివరకు ఉన్న ధరల కన్నా కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు తగ్గించి వేశారు.

విదేశీ ఆర్డర్ల ఖరారుతో..

గత పక్షంరోజుల పాటు తిరోగమనంలో సాగిన మార్కెట్ ప్రస్తుతం తిరిగి ఊపందుకుంది. గరిష్ఠ ధర కిలో రూ.315 నుంచి రూ.318 వరకు పలుకుతుండగా మీడియం ధరలు కిలో రూ.280 నుంచి రూ.290 వరకు అలాగే లోగ్రేడ్‌లు సైతం కిలో రూ.250 వరకు లభిస్తున్నాయి. ఎందుకు పనికిరాదనుకునే ఎన్.ఓ.డి. బేళ్లను సైతం కిలో రూ.220పైగా కొంటున్నారు. ఇప్పటివరకు అక్కడ 51 మిలియన్ కిలోలు కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.268 ధర లభించింది. కాగా ఒక్కసారిగా ఈ స్థాయిలో అక్కడ ధరలు పుంజుకోవడానికి ప్రధాన కారణం పలు కంపెనీలకు విదేశీ ఆర్డర్లు ఖరారు కావడమేనని తెలుస్తోంది. సాధారణంగా కర్ణాటకలో ఈ సమయంలో రోజువారీ వేలంకేంద్రాలకు సగటున 1,200 నుంచి 1,500 బేళ్ళు వస్తుంటాయి. అలాంటిది ఇప్పుడు 800 నుంచి వెయ్యి బేళ్ల వరకు మాత్రమే వస్తున్నట్లు సమాచారం. దీంతో వచ్చి బేళ్ల కోసం వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తుండటంతో ఆ మేర ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే మార్కెట్ తాత్కాలికమేనని రానున్న రోజుల్లో అక్కడ కూడా మళ్లీ ధరలు తగ్గే అవకాశం ఉంటుందని పొగాకు రంగంలోని నిపుణులు చెప్తున్నారు. ఆంధ్ర మార్కెట్‌ప్రారంభం నాటికి ధరలు మరింత తగ్గే అవకాశం ఉండే అవకాశాలు ఉన్నాయని చెప్తున్నారు.

ఐదు పోస్టులు.. ఒకే ఒక్కరు

- మరో మూడు పోస్టులలో ఇంకొకరు
- జలవనరులశాఖలో విచిత్ర పరిస్థితి
- డీఈలకు ఉద్యోగోన్నతులు కల్పిస్తే ఈఈ పోస్టులు భర్తీ


జలవనరుల శాఖ కార్యాలయం (ఫైల్)

ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సాగునీటి వనరులను పర్యవేక్షించే జలవనరులశాఖ ఒంగోలు కేంద్రంగా ఉన్న సర్కిల్ పరిధిలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. అత్యంత కీలకమైన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) పోస్టులు పలు రెగ్యులర్ అధికారులు లేక ఖాళీగా ఉండగా ఒకే అధికారి ప్రస్తుతం ఐదు పోస్టులు నిర్వహిస్తున్నారు. మరో అధికారి మూడింటిలో కొనసాగుతున్నారు. ఒంగోలు కేంద్రంగా ఉన్న సర్కిల్ పరిధిలో సుమారు 4.47 లక్షల ఎకరాల ఆయకట్టు ఎన్ఎస్‌పీ పరిధిలోనూ, 40వేల ఎకరాలు మీడియం, లక్షా 35వేల ఎకరాలు మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్నాయి. అంటే ఉమ్మడి జిల్లాలోని మొత్తం సాగర్ ఆయకట్టు, మోపాడు రిజర్వాయర్, కంభం చెరువు, పీబీ ఆనకట్ట వంటి మీడియం అలాగే 953 సాగునీటి చెరువులు అన్ని ఈ సర్కిల్ పరిధిలో ఉంటాయి. వాటి పర్యవేక్షణ ఒంగోలు సర్కిల్ ఎస్ఈ చూస్తుండగా అత్యంత కీలకమైన డివిజన్ స్థాయి ఈఈలు ఎనిమిది మంది ఉంటారు. వాటిలో ప్రస్తుతం ఎస్ఈగా రెగ్యులర్ అధికారైన వరలక్ష్మి మూడు మాసాల క్రితం బాధ్యతలు స్వీకరించి పనిచేస్తుండగా ఎన్ఎస్‌పీ విభాగంలో ఉన్న మూడు ఈఈ పోస్టులలో ఒక్కరే ఉన్నారు.

దర్శి ఈఈకి నాలుగు ఇన్‌చార్జి బాధ్యతలు

గతంలో చీమకుర్తికి ఈఈగా ఉన్న అధికారి పదోన్నతిపై లింగంగుంట్ల ఎస్ఈగా వెళ్లగా అద్దంకి ఈఈని ఒంగోలులోని ప్రాజెక్టుల ఎస్ఈగా నియమించారు. ఇక దర్శిలో ఈఈగా రామకృష్ణ ఉన్నారు. ఆయన గతంలో ఎస్ఈ కార్యాలయంలో డిప్యూటీ ఎస్ఈగా పనిచేస్తుండగా దర్శి ఈఈగా బదిలీ చేశారు. ఇటీవల ఉద్యోగోన్నతిపై అద్దంకి, చీమకుర్తి ఈఈలను బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో ఇంతవరకు ఎవరిని నియమించలేదు. ఎస్ఈ ఆఫీసులో డీఈఈగా ఉన్న అధికారికి దర్శి మార్చినా ఇక్కడ ఎవరిని నియమించలేదు. మూడు ఈఈ పోస్టులు ఖాళీగా ఉండగా ప్రస్తుతం దర్శి ఈఈగా ఉన్న రామకృష్ణ దర్శిలో రెగ్యులర్ బాధ్యతలతోపాటు ఒంగోలు ఎస్ఈ కార్యాలయంలో డీఎస్ఈ పోస్టు అలాగే చీమకుర్తి ఈఈ పోస్టులకు మూటింటికి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. అలాగే ఒంగోలులోని గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో ఉన్న ఎన్ఎస్‌పీ నిర్వహణ అనే మరో ఈఈ పోస్టును కూడా చాలాకాలంగా ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అంటే రామకృష్ణ అనే అధికారి ఈఈతోపాటు మరో నాలుగు ఇన్‌చార్జ్‌లు కలిపి మొత్తం ఐదు పోస్టులలో ఒక్కడే పనిచేస్తున్నారు సాగర్ నీరు ఆయకట్టు భూములకు అందించడం, తాగునీటి వనరులకు చేర్చడంలో ఈఈ స్థాయి అధికారి అత్యంత కీలకం. అదేసమయంలో సర్కిల్ కార్యాలయంలో మొత్తం క్షేత్రస్థాయి శాఖపరమైన ఉత్తర, ప్రత్యుత్తరాలు, ఇతర నిర్వహణ పరమైన అంశాలు, జిల్లా యంత్రాంగం సమీక్షలు, ఉన్నత స్థాయి అధికారులకు నివేదికలు పంపడం వంటి అంశాలలో సర్కిల్ ఆఫీసులోని డీఎస్ఈ పోస్టు చాలా ప్రధానమైనది. అలా కీలకమైన పలు పోస్టులలో ఒకే అధికారి ఉండగా ఆయన సర్కిల్ ఆఫీసులోని డీఎస్ఈ పోస్టు బాధ్యతలతోనే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుండగా ఇతర ప్రాంతాలలో పర్యవేక్షణ కొరవడింది.

వారానికి ఒకరోజు కష్టమే..

ఇక ఈ సర్కిల్ పరిధిలోని మార్కాపురంలో రెగ్యులర్ ఇరిగేషన్ ఈఈ పోస్టు ఉండగా అక్కడ పూర్ణానందరెడ్డి పనిచేస్తున్నారు. ఆయనకు రాళ్లపాడు ప్రాజెక్టుతో పాటు దోర్నాలలోని వెలిగొండ ప్రాజెక్టు ఈఈ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అలా మూడు పోస్టులలో ఆయన కొనసాగుతున్నారు. ఒంగోలు రెగ్యులర్ ఈఈ పోస్టులో డీఈ స్థాయి అధికారైన శివరాం ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అలా ఇతర ఈఈ పోస్టుల్లోనూ డీఈలను ఇన్‌చార్జ్‌లుగా నియమించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం స్థానిక అవసరాలకు అనుగుణంగా జిల్లా స్థాయిలో సర్దుబాటుకు అవకాశం కల్పించలేదు. దీంతో ఐదు కీలక పోస్టులలో ఒకరు, మరో మూడింటిలో ఇంకొక అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో కీలకమైన ఈ సమయంలో కనీసం వారు ఇన్‌చార్జ్‌లుగా ఉన్న కార్యాలయాలకు వారానికి ఒక రోజు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక సాగునీటి పర్యవేక్షణ, పనుల పరిశీలన, కార్యాలయాలకు వచ్చే రైతులు, ఇతర ప్రజలకు సమాధానం చెప్పే పరిస్థితి లేకుండాపోయింది.


ఎస్‌వీఆర్ పార్థీవదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో టీడీపీ నాయకులు

ఎస్‌వీఆర్‌కి ఎమ్మెల్యే ఏలూరి నివాళి

మార్టూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన శానంపూడి వెంకటేశ్వరరావు (ఎస్‌వీఆర్) పార్థీవదేహానికి గురువారం ఉదయం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.మండలంలోని జొన్నతాళి గ్రామానికి చెందిన సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ భర్త వెంకటేశ్వరరావు అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందిన విషయం విదితమే. జొన్నతాళి గ్రామంలోని ఆయన ఇంటికి తీసుకు వచ్చిన వెంకటేశ్వరరావు పార్థీవదేహం వద్ద ఎమ్మెల్యే ఏలూరి తో పాటు టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామేపల్లి హరిబాబు, అడుసుమల్లి శ్రీనివాసరావు,కామినేని జనార్దన్, షేక్‌రజాక్ తదితరులు పాల్గొన్నారు.


అనుమానితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువుల వివరాలు వెల్లడిస్తున్న ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్

అదుపులో అనుమానితులు

- రూ.లక్ష విలువగల సొత్తు స్వాధీనం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : పలువురు అనుమానితుల్ని ఈపూరుపాలెం పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు చేసేక్రమంలో ఈపూరుపాలెం సినిమా హాల్ వద్ద ఓ కారులో ముగ్గురు మహిళలు ఇత్తడి పూత వస్తువులు, స్టీలు ప్లేట్స్, నూతన వస్త్రాలు, ఐరన్ బాక్సులు తరలిస్తుండగా వారిని తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫైళ్ల పరిష్కారంలో ఐదవ స్థానంలో మంత్రి స్వామి

- కేబినెట్ భేటీలో ప్రకటించిన సీఎం



ఒంగోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫైళ్ల పరిష్కారంలో జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఐదవ స్థానంలో నిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల కన్నా ముందు వరుసలో డాక్టర్ స్వామి ఉన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జూలై నుంచి డిసెంబరు వరకు ఆరు మాసాల కాలాన్ని పరిగణనలోకి తీసుకొని పరిష్కారంలో మంత్రుల పనితీరు ఎలా ఉందనే అంశాన్ని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం ప్రస్తావించారు. తాను ఆరవ స్థానంలో ఉన్నట్లు స్వయంగా ప్రకటించిన చంద్రబాబు ఆరు నెలల్లో అందరికన్నా వేగంగా ఫైళ్లను పరిష్కరించి మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తొలిస్థానంలో ఉన్నట్లు చెప్పారు. అలాగే మంత్రులందరూ ఎవరెవరు ఏ స్థానాల్లో ఉన్నారన్న విషయాన్ని కూడా ప్రకటించారు. అందులో జిల్లాకు చెందిన డాక్టర్ స్వామి 5వ స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. సీఎం 6వ స్థానంలో, డిప్యూటీ సీఎం 10వ స్థానంలో, నారా లోకేష్ 8వస్థానంలో ఉండగా ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 13వ స్థానంలో ఉన్నారు.


విద్యాశాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పాఠశాలల హేతుబద్ధీకరణ పూర్తి

- పునఃనిర్మాణ ప్రక్రియను ఆమోదించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాఠశాలల హేతుబద్ధీకరణకు విద్యాశాఖ రూపొందించిన ప్రతిపాదనలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆమోదించారు. జిల్లాలో పాఠశాలల పునఃనిర్మాణానికి సంబంధించి మండలాల వారీగా తయారుచేసిన పీపీటీలను ఆమె సమీక్షించారు. పాఠశాలలను హేతుబద్ధీకరణ చేసేందుకు ప్రభుత్వం విధివిధానాలను జారీచేయడంతో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో బడులను హేతుబద్ధీకరణ చేసేందుకు పాఠశాల యాజమాన్య కమిటీల అభిప్రాయాలను సేకరించారు. తదనుగుణంగా జిల్లాలోని 38 మండలాల పాఠశాలల పునఃనిర్మాణ ప్రక్రియను ఆమోదించడంతోపాటు కొన్నిచోట్ల చిన్న చిన్న మార్పులు చేయాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. విద్యాశాఖ అధికారులు సమర్పించిన వివరాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలల హేతుబద్ధీకరణకు తీసుకున్న పలు అంశాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీఈవో ఏ. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి చిన్నయ్య, పక్కన వెలుగు సిబ్బంది

బ్యాంకు రుణాలపై రైతులకు అవగాహన

పర్చూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : రైతులకు బ్యాంకుల ద్వారా అందించే రుణాలపై గురువారం ఏపీఎం రామకృష్ణ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధికారి చిన్నయ్య మాట్లాడుతూ ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలన్నారు. దీంతోపాటు రైతులకు బ్యాంకు నుంచి ఇచ్చే రుణాలపై సన్న, చిన్నకారు రైతులకు తప్పక వివరించాలన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. 50శాతం సబ్సిడీతో లభించే షేడ్‌నెట్ గురించి వివరించారు. రైతులకు సాగు ఖర్చులు తగ్గించి ఆదాయ వనరులను పెంచే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో సిబ్బంది రవీంద్రబాబు, రవికుమార్, ప్రమీల, శ్రీనివాసులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో పిందెలు రాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మామిడి రైతులతో మాట్లాడుతున్న ఉద్యానఅధికారి హనుమంతనాయక్

మార్టూరు,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి):బూడిద తెగులు నివారణకు, మామిడిలో పిందెలు రాలిపోకుండా ముందస్తు జాగ్రత్తగా మందులను వినియోగించాలని రైతులకు ఉద్యానఅధికారి హనుమంతనాయక్ సూచించారు. గురువారం మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో మామిడి తోటలలో సస్యరక్షణ చర్యలపై ఏర్పాటుచేసిన రైతు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పూత,పిందె దశలో చేపట్టవలసిన చర్యలను వివరించారు. వాతావరణ మార్పుల దృష్ట్యా పంటలకు ఆశించే తెగుళ్లు, రసంపీల్చేపురుగులు, పోషకాల ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కన్సల్టెంట్ కె. విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని సచివాలయంలో గురువారం చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. చీరాల పరిధిలో మత్స్యకారుల సమస్యల పరిష్కారం దిశగా కృషిచేయాలని కోరారు. గత ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించినట్లు చెప్పారు. మత్స్యకార భరోసా, వలలు, బోట్లు వంటి వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఈక్రమంలో టీడీపీ కూటమి మత్స్యకారులను ఆదుకోవాలన్నారు. హార్బర్, టూరిజం అంశాలను అలాగే చీరాల పరిస్థితులను, అభివృద్ధి పనులను సీఎం దృష్టికి రాష్ట్ర మంత్రులు కింజరపు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వివరించారు. ఎమ్మెల్యే వెంట పలువురు నాయకులు ఉన్నారు


సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే కొండయ్య


చిన్నకొత్తపల్లి సచివాలయంలో రిజిస్టర్‌ను పరిశీలించి ప్రశ్నిస్తున్న ఎంపీడీవో సింగయ్య

ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయంలో పని చేసే ఉద్యోగులు సమయపాలన పాటించి సకాలంలో కార్యాలయానికి హాజరు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య ఆదేశించారు. గురువారం మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆ యా విభాగాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న చిన్నారులకు సంబంధించి ఆధార్ కార్డులు ఉన్నాయా, లేవా అనే విషయాలను వెంటనే పరిశీలించి తగిన సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావు, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ మంత్రి వనమా


కలెక్టర్‌ను సన్మానిస్తున్న మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ వెంకట మురళీని గురువారం మాజీ మంత్రి, చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ వనమా వెంకటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కలెక్టర్ సేవలను కొనియాడారు. ఆయన వెంట కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, మేనేజర్ రమణమూర్తి, ఫిజికల్ డైరక్టర్ అన్నం శ్రీనివాసరావు ఉన్నారు.

వద్దన్నా ఆటోల్లోనే కూలీలు


దర్శి రోడ్డులో నుంచి అద్దంకి పట్టణంలోకి బారులుగా నడిచి వస్తున్న కూలీలు

తనిఖీలతో అవస్థలు

మార్గ మధ్యంలోనే వదిలేసిన డ్రైవర్‌లు

కాలి నడకతో ఇళ్లకు చేరిన వైనం

అద్దంకి, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా పోలీస్ అధికారులు మూకుమ్మడిగా గురువారం సాయంత్రం తనిఖీలు చేపడ్డటంతో ఆటోల డ్రైవర్‌లు ఎక్కడికక్కడ నిలిపి వేసి అందులో ప్రయాణించే కూలీలను రోడ్డు పైనే వదిలివేయటంతో వారికి కాలి నడక తప్పలేదు. అద్దంకి పట్టణంతో పాటు సమీప గ్రామాల నుంచి ముండ్లమూరు, తాళ్లూరు మండలాలలో మిర్చి కోతలకు , తిమ్మాయపాలెం వద్ద ఇటుక బట్టీల పనులకు నిత్యం వందల సంఖ్యలో కూలీలు వెళ్ళి వస్తుంటారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ట్రాలీ ఆటోలతో పాటు ప్రయాణికుల ఆటోలలో పరిమితికి మించి వెళుతూ ప్రమాదపు అంచున ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఆటోలు అదుపు తప్పి బోల్తా పడి ప్రయాణికులకు తీవ్ర గాయాలు కూడా అయ్యాయి. ప్రమాదమని తెలిసి కూడా అవసరం కోసం కూలీలు ఆటోలలో ప్రయాణాలు సాగిస్తూనే ఉన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా గురువారం సాయంత్ర ం సీఐ సుబ్బరాజు, ఎస్సై లు ఖాదర్‌బాషా, రవితేజలు అద్దంకి పట్టణంతో పాటు తిమ్మాయపాలెం, కలవకూరు రోడ్డులలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. దీంతో పోలీస్ అధికారులకు దొరికిపోతామని ఆటో డ్రైవర్‌లు కూలీలను ఎక్కడికక్కడ దించి వెళ్లిపోయారు. దీంతో కూలీలు వందల సంఖ్యలో కాలినడకన రెండు, మూడు కిలోమీటర్ల దూరం తిమ్మాయపాలెం నుంచి అద్దంకి పట్టణంలోని వివిధ కాలనీలకు చేరుకున్నారు.

పోలీస్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేసిన నేపథ్యంలో వ్యవసాయ కూలీలు పనులకు వెళ్లే సమయాలలో ఆయా రూట్లలో ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా చర్యలు చేపడితే వారికి రవాణా కష్టాలు తప్పటం తో పాటు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి కూలీలు పనులకు వెళ్లే రూట్లను గుర్తించి ఆయా సమయాలలో ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు సూచిస్తున్నారు.


తిమ్మాయపాలెం వద్ద తనిఖీల కోసం ఉన్న ఎస్సై రవితేజ, సిబ్బంది

సింథైట్ ఫ్యాక్టరీలో అధికారుల పరిశీలన

మిరప వ్యర్థాల వాడకం, కోరుపై విచారణ

మేదరమెట్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సింథైట్ ఫ్యాక్టరీలో మిరప వ్యర్థాల వాడకంపై గురువారం చీరాల ఆర్డీవో తుమాటి చంద్రశేఖర్ నాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ జి.రాఘవరెడ్డి తదితర అధికారులు పరిశీలన చేశారు. ఫ్యాక్టరీలో మిరప వ్యర్థాలను వాడవద్దని గత ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, రాఘవరెడ్డి తదితర అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం మిర్చి సీజన్ మొదలవుతున్నందున్న బాయిలర్‌లో మిరప వ్యర్థాలు వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలని కంపెనీ దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో అధికారులు పరిశీలనకు వచ్చారు. గతంలో విపరీతంగా కోరు వస్తున్నదని గ్రామస్థులు ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేపట్టగా అధికారులు ఈ ఆదేశాలను జారీ చేశారు. ఐఐటీ చెన్నైకి చెందిన నిపుణులు పరిశీలన చేసి వ్యర్థాలను బాయిలర్‌లో వాడుకోవడానికి అనుమతి ఇచ్చారని ఫ్యాక్టరీ యాజమాన్యం అధికారులు తెలియజేసింది. వ్యర్థాలు వాడడం వలన ఎటువంటి కోరు రాదని వారు అధికారులకు తెలిపారు. గ్రామస్థులు మాత్రం వ్యర్థాలు వాడడానికి వీలు లేదని, గతంలో అవి వాడడం వలనే కోరు వచ్చిందని అధికారులకు తెలిపారు. అధికారులు ఇరువైపులా వాదనలు విన్నారు. కోరు రాకుండా ఏమి వాడినా అభ్యంతరం లేదన్నారు. తాము గత కొన్ని సంవత్సరాలుగా కోరుపైనే పోరాడుతున్నామని, ఫ్యాక్టరీ నుంచి వచ్చిన వ్యర్థ జలాలు యర్రబాలెం చెరువులో కలుస్తున్నాయని అధికారులకు తెలియజేశారు. అధికారులు పరిశీలించి శాంపిల్స్ తీసుకున్నారు. ఎనిమిది మంది సభ్యులతో కూడిన విచారణ బృందం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ట్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ మాధవనాయుడు, జిల్లా ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ హుస్సేన్, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు, డీఎస్‌పీ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ గాయత్రిదేవి, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఫ్యాక్టరీ జీఎం అమరనేని అంజనేయులు, సలాం, జయరామన్, గ్రామస్థులు చావా రాజేష్, కనుమూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .


సింథైట్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఆర్‌డీవో, పీసీడీ ఈఈ రాఘవరెడ్డి తదితర అధికారులు

వేటకువెళ్లి సముద్రంలో అదృశ్యం

- ఐదు రోజులైనా కానరాని ఆచూకీ
- రోదిస్తున్న మత్స్యకార కుటుంబం


విచార వదనంలో మత్స్యకారుడి బంధువులు (ఇన్‌సెట్లో) అదృశ్యమైన రమణ (ఫైల్)

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : బతుకు పోరాటంలో సముద్రతీరంలో ప్రమాదవశాత్తు అదృశ్యమయ్యాడు. ఎంత వెదికినా ఆచూకీ లేదు. దీంతో వాడరేవు మత్స్యకార కుటుంబం రోదిస్తోంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని వాడరేవు గ్రామానికి చెందిన ఓసిపిల్లి రమణ(53)మత్స్యకారుడు. ఇతనికి భార్య నూకమ్మ, కుమారుడు సత్తిబాబు, ఇద్దరు కుమార్తెలు. ఆదివారం ఉదయం మనవడు చింతకాయల ప్రసాద్, మురళీ, పారా సూరిరావులతో కలిసి రమణ చేపల వేటకు వెళ్లాడు. ఈక్రమంలో రాత్రి సమయంలో సముద్రంలో బోటులో ప్రయాణిస్తూ సుమారు 100 కిలో మీటర్లు మేర విజయవాడలోని బందరు వైపు వేటకు వెళ్లారు. అక్కడ బోటులోనే మనవడితో అర్ధరాత్రి వరకు సరదాగా మాట్లాడుకున్నారు. బాగా ఆలస్యం కావడంతో ఇక పడుకుందామని చెప్పడంతో అందరూ పడుకున్నారు. 3 గంటల సమయంలో టీ పెట్టుకునేందుకు లేచి చూడగా తాత బోటులో కనిపించలేదు.. దీంతో బిత్తరపోయిన మనవడు ప్రసాద్ మిగిలిన వారితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. కనిపించిన బోట్లలోని మత్స్యకారులందరిని ఆరా తీశారు. ప్రయోజనం లేకపోవడంతో మరుసటి రోజు ఉదయం సోమవారం కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. ఈక్రమంలో సుమారు ఐదు రోజులుగా గాలింపు చేస్తూనే ఉన్నారు. అయినా కుటుంబ పెద్ద జాడలేకపోవడంతో ఇప్పటికే ఆశలు వదిలిన కుటుంబ సభ్యులు చివరి చూపయినా దక్కాలని వేడుకుంటున్నారు. ఈ హృదయ విదారక ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

అగ్ని ప్రమాదం విచారకరం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

పర్చూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి శేష బ్రహ్మాచారి టింబర్ డిపో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం అర్ధరాత్రి దగ్ధం అయ్యింది. విషయం తెలియడంతో గురువారం రాత్రి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆయన నివాసానికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం అగ్ని ప్రమాదానికి గురైన టింబర్ డిపోను ఆయన పరిశీలించారు. అగ్ని ప్రమాద సంఘటన విచారకరం అన్నారు. అధైర్య పడవద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ షంషుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, ఫ్యాక్టరీ శ్రీనివాసరావు, కారుమంచి కృష్ణ, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, లక్కిపోగు సుమన్, చెరుకూరి చింపయ్య, కొరిటాల సురేష్, కాపు రవిచంద్ర, విన్నకోట సతీష్, పోహూరి శ్రీనివాసరావు, తులసి శ్రీనివాసరావు, గౌస్, పఠాన్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులు

పర్చూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రమాదం విషయం తెలుసుకున్న మార్టూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శేషగిరిరావు, రీజనల్ ఫైర్ ఆఫీసర్ జిలాని, బాపట్ల జిల్లా ఫైర్ అధికారి మాధవ నాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. టింబర్ డిపో యజమాని కోడూరి శేషబ్రహ్మాచారిని అడిగి తెలుసుకున్నారు. అర్ధరాత్రి 1.30గంటల సమయంలో టింబర్ డిపోలో మంటలు వస్తున్నాయని తనకు ఫోన్ వచ్చిందన్నారు. వెంటనే వెళ్లి చూడగా డిపో మొత్తం మంటలు వ్యాపించి ఉన్నాయని, కేకలు వేసి చుట్టు పక్కల వారిని అప్రమత్తం చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగుంటదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో టింబర్ డిపో యజమాని పేర్కొన్నారు.


ప్రమాదం జరిగిన టింబర్ డిపోను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, టీడీపీ నేతలు

తహసీల్దార్‌కు సన్మానం

చినగంజాం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : స్థానిక తహ సీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు గురువారం సన్మానించారు. గత నెల 26వ తేదీ రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ వెంకటమురళి నుంచి ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంసాపత్రాన్ని అందకున్న సందర్భంగా ఆయన్ను రాష్ట్ర ఐక్య వేదిక కమిటీ సభ్యులు బొకేలు, మెమెంటో అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రభాకరరావు వివిధ హోదాలలో ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాలను ఏడుసార్లు అందుకోవడం అభినందనీయమని ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్‌బాబు అన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రకాశం, బాపట్ల జిల్లాల అధ్యక్షులు జగన్నాథం యోహాను, విస్తర్ల వెంకట సుబ్బారావు, మదర్సా ప్రిన్సిపాల్ సయ్యద్ హుస్సేన్, అద్దంకి చైతన్య బధిరుల పాఠశాల చైర్మన్ పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపాల్ పెద్దినేని సురేంద్ర బాబు, విద్యార్థినులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు

సెయింట్ ఆన్స్‌లో

సివిల్ విద్యార్థులకు రెండు రోజుల వర్క్‌షాపు

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులకు ప్రాజెక్టు ప్లానింగ్ సాఫ్ట్‌వేర్, మైక్రోసాఫ్ట్ ప్రాజెక్టుపై రెండు రోజుల వర్క్‌షాపు గురువారం ప్రారంభమైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. జగదీష్, డీన్ శ్రీహరి, ప్రొఫెసర్ రవీంద్రనాథ్ చౌదరి, కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు

మిరప పంట పరిశీలన

మార్టూరు,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రైతు పెంట్యాల శరత్ సేంద్రియ వ్యసాయంతో పండిస్తున్న మిరప పంటను గురువారం ఎన్‌ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ ఎం. శేషుమాదవ్ పరిశీలించారు. మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో రైతు శరత్ సేంద్రియ వ్యవసాయంద్వారా బొప్పాయి, కూరగాయలు, చిరుధాన్యాలు, తృణ ధాన్యాలతోపాటు మిరప పంటను సాగుచేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ రాబోయే సంవత్సరంలో మిర్చి పంటను సేంద్రియ పద్ధతులలో పండించేవిధానంపై రైతులకు శిక్షణ ఇస్తానని తెలిపారు. నాణ్యమైన మిరప పంట సాగుకు ఎన్‌ఐఆర్‌సీఏ తరఫున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలకు సహకారం అందిస్తామన్నారు.


మిరప పంటను పరిశీలిస్తున్న ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ శేషుమాదవ్

సుస్థిరసాగుపై అవగాహన

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సుస్థిర సాగుపై అవగాహన వలన మేలైన దిగుబడులు సాధించవచ్చని గ్రామసిరి ఐటీసీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్‌ఎస్‌ఎస్ శాస్త్రి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పిట్టువారిపాలెంలో మండల వ్యవసాయాధికారిణి సుమతి ఆధ్వర్యంలో రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా సేంద్రియ వ్యవసాయ సహాయక అధికారి టి. మోహన్ మాట్లాడుతూ జీవనో పాదులు పెంచుకోవడం, నవ ధాన్యాల సాగు వంటి అంశాలను పూర్తి స్థాయిలో తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.


గుంటుపల్లి గ్రామ సరిహద్దును పరిశీలిస్తున్న సర్వే ల్యాండ్ ఏడీ తదితరులు

ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల వివరాలను సేకరించాలి

బల్లికురవ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేయిస్తున్న భూ రీసర్వేలో గ్రామాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులతో పాటు స్థలాల వివరాలను సేకరించాలని జిల్లా సర్వే ల్యాండ్ ఏడీ కనకప్రసాద్ కోరారు. గురువారం గుంటుపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను అధికారులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా గ్రామ సరిహద్దు మ్యాప్‌ను పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే వెంటనే పూర్తి చేసేలా సిబ్బంది పనిచేయాలన్నారు. రైతులు, ప్రజల సమక్షంలో సర్వే చేయాలని, ఎక్కడా వివాదాలు రాకుండా చూడాలన్నారు. అనంతరం చెన్నుపల్లి ఈనాం భూముల రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ రవినాయక్, సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రహర్ష తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కుడిచేయి మణికట్టు, కాళ్లకు తీవ్ర గాయాలు
- మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలింపు


తీవ్ర గాయాలతో ఏరియా వైద్యశాలలో సత్యనారాయణ

చీరాలటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఆర్వోబీ వంతెన సమీపంలో స్థానిక హరి ప్రసాద్ నగర్‌కు చెందిన కన్నపరెడ్డి సత్యన్నారాయణ గురువారం రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో అతని కుడిచేయి మణికట్టు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అలాగే అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. రైల్వే పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : అప్పు చెల్లించే విషయంలో తల్లిపై మనస్తాపం చెందిన కుమార్తె(వివాహిత) ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను ఉరి నుంచి తప్పించి చీరాల్లోని ఓ ప్రయివేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామంలోనే మరొకరి వద్ద తల్లికి కొంత అప్పు ఇప్పించగా అవి చెల్లించే క్రమంలో జాప్యం జరిగింది. ఈక్రమంలో అప్పు ఇచ్చిన వారు కుమార్తెను నిలదీశారు. ఈవిషయంపై తల్లీకూతుళ్ల మధ్య వాదన జరిగింది. దీంతో మనస్తాపం చెందిన కుమార్తె గురువారం ఈ ఘటనకు పాల్పడింది.

వరిగడ్డి వామి దగ్ధం


మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు

మార్టూరు,ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో ఎస్టీ కాలనీ సమీపంలో చెరువుకట్టపై గురువారం మల్లా వీరయ్యకు చెందిన వరిగడ్డి వామి దగ్ధమయింది. సుమారు రూ. 12 వేల విలువైన ట్రాక్టరు గడ్డి కాలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. గడ్డివామి నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు సమీపంలో ఉన్న చెరువులోనుంచి ట్యాంకరు తో నీటిని తీసుకువచ్చి మంటలను ఆర్పివేశారు.అయితే అప్పటికే గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది.

20 కేసుల నమోదు

ఇంకొల్లు,ఫిబ్రవరి 6,(ఆంధ్రజ్యోతి) : స్థానిక జెండా చెట్టు కూడలిలో ఇంకొల్లు ఎస్సై సురేష్ గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సక్రమంగా రికార్డులు లేని లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై 20 కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.1200 జరిమానా విధించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.